ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
ఆదివారం 6 అక్టోబరు 2024


చిన్న శేష వాహనంపై మురళీకృష్ణుడి రూపంలో మలయప్ప విహారం

మోహన రూపుడదిగో!


హంస వాహనంపై సరస్వతీ దేవి రూపంలో మలయప్ప విహారం

'వెలయగ ఐదారువేల మగువలను..అలమిన ఘన మోహన రూపం' అని అన్నమయ్య వర్ణించినట్లుగా తిరుమలేశుడు మాడవీధుల్లో మెరుపుల రేడుగా మారి భక్తులను కటాక్షించాడు. బ్రహ్మోత్సవాల రెండవ రోజు ఉదయం నాగలోకానికే రాజైన చిన్న శేషుడిపై మురళి ఆలపిస్తూ శ్రీకృష్ణుడై విహరించాడు. రాత్రి హంస వాహనరూఢుడై సరస్వతీ రూపుడై.. కూచిపూడి, ఒడిస్సీ, జాగో, భరతనాట్య ప్రదర్శనలను తిలకిస్తూ ఊరేగాడు. ఉదయం వకుళమాత వంటశాలను సీఎం చంద్రబాబు ప్రారంభించారు. హఠాత్తుగా ముంచిపోసిన వాన.. చల్లని గాలులు.. వేద ఘోష.. గోవింద నామ స్మరణలతో తిరుమల కొండ ఆధ్యాత్మిక ఆనందాన్ని భక్తుల మదిలో నింపింది.

- తిరుమల,ఆంధ్రజ్యోతి

ఫ్లైఓవర్ నుంచి దూకి ఆత్మహత్య

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 5: తిరుపతిలోని శ్రీనివాస సేతు ఫ్లై ఓవర్ నుంచి దూకి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. అలిపిరి ఎస్ఐ లోకేష్‌బాబు వివరాల మేరకు.. 20 నుంచి 25ఏళ్ల యువకుడు ఫ్లై ఓవర్‌పై నడుచుకుంటూ వస్తూ లీలామహల్ సర్కిల్ వద్ద ఒక్కసారిగా కిందకు దూకేశాడు. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారం మేరకు అలిపిరి ఎస్ఐ లోకేష్ బాబు ఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాన్ని రుయాకు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మతిస్థిమితం లేకపోవడం వల్ల దూకాడా లేదా కుటుంబ సమస్యలా ఇంకేమైనా కారణాలు ఉన్నాయా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు. గుండు చేసుకుని ఉండడంతో తిరుమల నుంచి వచ్చినట్లు భావిస్తున్నారు. మృతుడు ఎర్రటి టీషర్టు, గోధుమ రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. వివరాలు తెలిసిన వారు అలిపిరి పోలీసు స్టేషన్‌లో సం ప్రదించాలని ఎస్ఐ కోరారు.


మృతి చెందిన యువకుడు

సీఎం మానవత్వం

● క్యాన్సర్ బాధితుడికి రూ.5లక్షల ఆర్థికసాయం

రేణిగుంట, అక్టోబరు 5: సీఎం చంద్రబాబు మానవత్వం చాటుకున్నారు. క్యాన్సర్ బాధితుడికి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందించారు. రేణిగుంటకు చెందిన పసుపులేటి సురేంద్ర బాబు(30) మానసిక వికలాంగుడు. పైగా లివర్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. చంద్రబాబు అంటే విపరీతమైన అభిమానం. చనిపోయేలోపు ఆయనతో ఫొటో దిగాలనుకున్నాడు. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ద్వారా సీఎం దృష్టికి తీసుకెళ్లాడు. తిరుమల శ్రీవారికి పట్టువస్త్రాల సమర్పణ అనంతరం శనివారం తిరుగు ప్రయాణంలో సీఎం వారిని పిలిపించి, ప్రత్యేకంగా మాట్లాడి ఫొటో దిగారు. వైద్య ఖర్చులకు ప్రభుత్వం తరపున రూ.5లక్షలు ఆర్థిక సాయం అందించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కాగా, రోడ్డు ప్రమాదంలో భర్త చనిపోవడంతో ఇద్దరు పిల్లల పోషణకు ఇబ్బంది పడుతున్నట్లు సుబ్బరత్నమ్మ అనే మహిళ చెప్పడంతో స్పందించిన సీఎం వారి కుటుంబానికి సత్వర సాయంగా రూ.50వేలు అందజేశారు. కలెక్టర్ వెంకటేశ్వర్,


బాధితుడికి చెక్కు అందజేస్తున్న సీఎం చంద్రబాబు

శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, జేసీ శుభం బన్సల్ వారి వెంట ఉన్నారు.


తిరుమల పాంచజన్యం విశ్రాంతి భవనం వెనుకభాగంలో ఔటర్‌రింగ్ రోడ్డు పక్కనే టీటీడీ నిర్మించిన వకుళమాత కేంద్రీకృత వంటశాలను సీఎం చంద్రబాబు శనివారం ప్రారంభించారు. ప్రసాదాల తయారీకి శ్రీకారం చుట్టారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

పీఎం కిసాన్ నిధులు రూ.27.26 కోట్లు విడుదల

తిరుపతి (ఎం.ఆర్.పల్లి), అక్టోబర్ 5: ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద జిల్లాకు రూ.27.26 కోట్లను 1,38,804 మంది రైతుల ఖాతాలకు శనివారం జమ చేసినట్లు జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం కింద ఏడాదికి రూ.6వేలు రైతుల ఖాతాలో కేంద్ర ప్రభుత్వం జమ చేస్తుందని పేర్కొన్నారు. 2019 నుంచి ఇప్పటివరకు 17 విడతలుగా జిల్లాకు రూ.519.55 కోట్లు జమ చేసినట్లు వెల్లడించారు.



'మెరిడియన్' మాయాజాలం

● కార్పొరేషన్ కట్టిన బిల్డింగ్‌కే నో 'ప్లానింగ్'
● దర్జాగా డీవియేషన్స్, పార్కింగ్ లేదు
● వైసీపీ చిన్నయ్య అనుచరుడి కోసం కొనసాగుతున్న కార్పొరేషన్ సహకారం

తిరుపతి-ఆంధ్రజ్యోతి

నగరంలో నిబంధనలు ఉల్లంఘించి ఏదైనా నిర్మాణం జరుగుతుంటే కార్పొరేషన్ కొరడా ఝుళిపిస్తుంది. మరి కార్పొరేషనే నిబంధనలు గాలికొదిలేసి నిర్మాణం చేసేస్తే ఎవరు చర్యలు తీసుకోవాలి? జగన్‌రెడ్డి పాలనలో తిరుపతిలో చక్రం తిప్పిన వైసీపీ చిన్నయ్య అనుచరుడి కోసం కార్పొరేషన్ కళ్లు కుట్టేసుకుని పని కానిచ్చేసింది. కపిలతీర్థం నంది సర్కిల్ వద్ద రూ.2కోట్ల స్మార్ట్ సిటీ నిధులతో పిలిగ్రిమ్ ఎమినిటీస్ సెంటర్ పేరిట 10వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన జీ+2 అంతస్తుల భవనాన్ని కారుచవగ్గా చిన్నయ్య అనుచరుడికి కటబెట్టేశారు కూడా. ప్రభుత్వం మారి వైసీపీ దందాలకు కాలం ముగిసినా అత్యంత విలువైన కూడలిలోని ఈ భవనాన్ని దక్కించుకున్న వైసీపీ నాయకుడు ఏ ఆటంకమూ లేకుండా వ్యాపారం చేసుకుంటూ ఉండడం విశేషం. ఇక్కడ రోడ్డు మీదే పార్కింగ్ చేయాల్సి వస్తోంది. తిరుమలకు వెళ్లే వాహనాల రద్దీ ఉండే ఈ ప్రదేశంలో ఇది ప్రమాదకరం కూడా. ప్రస్తుత కార్పొరేషన్ అధికారులైనా ఈ భవనం విషయంలో జరిగిన అక్రమాలు గ్రహించి దిద్దుబాటు చర్యలు తీసుకుంటారేమో చూడాలి.

నిబంధనలు ఇలా ఉల్లంఘించారు..

- టౌన్ ప్లానింగ్ నిబంధనలు పూర్తిగా గాలికొదిలేసి అర్ధ వృత్తాకారంలో ఈ భవనాన్ని నిర్మించారు.
- నిబంధనల మేరకు నాలుగు వైపులా 3 మీటర్ల చొప్పున సెట్ బ్యాక్స్ వదలాల్సి ఉన్నా పట్టించుకోలేదు.
- వాణిజ్య అవసరాల కోసం నిర్మించిన భవనం కాబట్టి 200 చ.మీ. పార్కింగ్ స్థలం కేటాయించాలి. అటువంటి ఏర్పాటు ఏదీ చేయలేదు.
- జీ+2తో నిర్మాణానికి అదనంగా మరో అంతస్తు వేసుకునే ప్రయత్నం టెండరు దక్కించుకున్న వ్యక్తి చేస్తున్నారు.
- దక్షిణ వైపు మరికొంత ఆక్రమించి మరీ ప్రహరీ నిర్మించుకున్నారు.

నెలకు అద్దె లక్షన్నరే!

కీలక ప్రదేశంలోని ఈ భవనం కార్పొరేషన్‌కు పెద్ద మొత్తంలో ఆదాయవనరుగా మారబోతోందని నిర్మాణ దశలో ఉన్నప్పుడు పరిశీలించిన అప్పటి కమిషనర్ అనుపమ చెప్పారు. చదరపు అడుగుకు కనీసం రూ.60 తక్కువ లేకుండా ఆ ప్రాంతంలో అద్దె డిమాండు ఉంది. అంటే నెలకు రూ.6లక్షల చొప్పున ఏడాదికి రూ.72లక్షలు కార్పొరేషన్‌కు కనీస ఆదాయం వస్తుంది. బాగా డిమాండు ఉన్న ప్రాంతం కాబట్టి టెండరులో ఏడాదికి కోటి రూపాయల వరకు పలకవచ్చు కూడా. అయితే అధికార పార్టీ పెద్దల ఒత్తిడితో జన బాహుళ్యానికి పెద్దగా తెలియని పత్రికల్లో ప్రకటన ఇచ్చి నాలుగు గోడల మధ్య టెండరు నిర్వహించేశారు. కేవలం నెలకు లక్షన్నర అద్దెతో ఇంత విలువైన భవనం కట్టబెట్టేశారు.

నేలపట్టు పక్షుల కేంద్రం సందర్శన ప్రారంభం


పక్షుల కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎఫ్‌వో హారిక

దొరవారిసత్రం, అక్టోబరు 5: మండలంలోని విదేశీ విహంగాల(పక్షులు) విడిది కేంద్రం నేలపట్టు పక్షుల కేంద్రాన్ని సందర్శకుల కోసం అధికారులు శనివారం ప్రారంభించారు. ఏప్రిల్‌లో పక్షుల విడిది పూర్తికాగానే మే నెలలో సందర్శకులకు అనుమతి నిలిపేశారు. పక్షుల విడిది మళ్లీ ప్రారంభం కావడంతో శనివారం గేట్లు తెరిచారు. అయితే ఈ ప్రాంతంలో వర్షాలు పెద్దగా పడకపోవడం, కేంద్రంలోని రెండు మంచి నీటి చెరువుల్లో నీరు లేకపోవడంతో పక్షుల విడిది ఇంకా ప్రారంభం కాలేదు. ఈ వారంలో పైలెట్ పక్షుల రాక ఉండవచ్చునని, అవి వచ్చి వెళ్లిన వారంలో పక్షుల రాక మొదలవుతుందని స్థానిక వన్యప్రాణి సంరక్షణ సిబ్బంది అభిప్రాయపడుతున్నారు. కాగా, సూళ్లూరుపేట వన్యప్రాణి సంరక్షణ శాఖ డీఎఫ్‌వో హారిక నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రాన్ని సందర్శించారు. పక్షుల విడిది సమయంలో సిబ్బంది తీసుకునే చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. నేలపట్టు, పులికాట్ ఎఫ్ఆర్‌వోలు సౌజన్య, నరసింహరావు, ఎఫ్ఎస్‌వో బాలయ్య ఆమె వెంట ఉన్నారు.

ఇస్రో స్పేస్ వాక్

సూళ్లూరుపేట, అక్టోబరు 5: అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా ఇస్రో శనివారం సూళ్లూరుపేటలో స్పేస్ వాక్ నిర్వహించింది. జూనియర్ కళాశాల నుంచి జీఎన్‌టీ రోడ్డు మీదుగా షార్ ఉద్యోగులు నివాసముండే డీవోఎస్ కాలనీ వరకు ప్రదర్శన సాగింది. ఇస్రో చేపట్టిన రాకెట్, ఉపగ్రహ నమూనాలను ప్రదర్శించారు. జయహో ఇస్రో అంటూ నినాదాలు చేశారు. స్పేస్ వాక్‌ను జెండా ఊపి ప్రారంభించిన షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ మాట్లాడుతూ విద్యార్థులు సైన్సుపై అవగాహన పెంచుకుంటే శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు దోహదపడుతుందన్నారు. అంతరిక్ష పరిశోధనల ద్వారా మనం సాధిస్తున్న ప్రగతిని, వాతావరణంలో వచ్చే మార్పులను ప్రజలకు తెలియజేసేందుకు ఏటా అంతరిక్ష వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. షార్ కంట్రోలర్ శ్రీనివాసుల రెడ్డి పాల్గొన్నారు.



స్పేస్ వాక్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న షార్ డైరెక్టర్ రాజరాజన్

సీఎంను కలిసిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి



చంద్రగిరి, అక్టోబరు 5: ముఖ్యమంత్రి చంద్రబాబును టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరపల్లి హేమాంబరధరరావు మర్యాద పూర్వకంగా కలిశారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా పట్టు వస్త్రాలు తీసుకువచ్చిన చంద్రబాబును శనివారం తిరుమలలో హేమాంబరధరరావు కలిశారు.

ముఖ్యమంత్రి చంద్రబాబుతో హేమాంబరధరరావు

ఎంబీయూలో ఉత్సాహంగా మోహన మంత్ర





చంద్రగిరి, అక్టోబరు 5: చంద్రగిరి మండలం, ఎ.రంగంపేట సమీపంలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో ప్రతిష్ఠాత్మకంగా ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న మోహన మంత్ర మహోత్సవం శనివారం జరిగింది. మూడు రోజుల పాటు జరిగే ఈకార్యక్రమంలో ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి దాదాపు 20 వేలమందికి పైగా విద్యార్థులు పాల్గొంటున్నారు. టెక్నోహాలిక్ రంగంలో టెక్ ఎగ్జిబిషన్, త్రీడీ డీఎంబీ కాంపిటేషన్, హకతోన్, క్విజ్‌నోమిక్స్, డ్రిడ్డి ఓ మానియ, ఫిన్ ఫ్లాగ్ వితవుట్ లాగ్, కోడ్ స్ప్రింట్, వర్చువల్ మోడలింగ్, రోబోవార్, గ్రావిటీ బ్లిట్, స్పెల్‌క్వెస్ట్ తదితర కార్యక్రమాలలో తమ మేధస్సును ఉపయోగించారు. కళాక్షేత్ర, స్పోర్ట్స్ ఈవెంట్స్‌లో భాగంగా లెట్స్ నాకో, వాయిస్ ఆఫ్ ఎంఎం, ర్యాంప్ వాక్, బాన్డ్ బాటిల్, పిక్చర్ ఫర్ఫెక్ట్, చికెన్ డిన్నర్(పబ్జీ), అల్టిమెట్ బాటిల్(షార్ట్‌ఫిలిమ్), రీల్ మాస్టర్, స్టాండప్ టాకీస్, మెమె చాలెంజ్, గల్లీ క్రికెట్, ట్రెసరర్ హంట్, డిజిటల్ ఈవెంట్ తదితర కార్యక్రమాలలో విద్యార్థుల తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. ఈక్రమంలో ఎంబీయూ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినయ్ మహేశ్వరి, వైస్‌చాన్సలర్ ఆచార్య నాగరాజ రామరావ్, చీఫ్ గ్రోత్ స్ట్రాటజిక్ ఆఫీసర్ వికాస్ సింగ్, రిజిస్ట్రార్ కె.సారథి, డీన్లు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

తిరుచ్చిపై దర్శనమిచ్చిన కల్యాణ వెంకన్న



చంద్రగిరి, అక్టోబరు 5: శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. సాయంత్రం తిరుచ్చి వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు భక్తి శ్రద్ధలతో ఆలయ ఆవరణలో దీపారాధన చేశారు. ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారిమెట్టు వద్ద అన్నదానం



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న డాలర్స్ దివాకర్‌రెడ్డి

చంద్రగిరి, అక్టోబరు 5: చంద్రగిరి మండలం, కూచువారిపల్లెకు చెందిన పాలడుగు శ్రీనివాసులు నాయుడు ఆధ్వర్యంలో గోవింద సేవా మండలి ద్వారా 12 ఏళ్లుగా శ్రీవారిమెట్టు వద్ద తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలలో అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లే భక్తులకు ఉదయం నుంచి సాయంత్రం వరకు అల్పాహారం, భోజనం, తిరుబండారాలు, రుచికరమైన ఆహారాన్ని అందిస్తున్నారు. మండలంలోని భీమవరం, పుల్లయ్యగారిపల్లె, నారావారిపల్లె, కొటాల, ఎ.రంగంపేట తదితర గ్రామాల నుంచి రైతులు, భక్తులు స్వచ్ఛందంగా అన్నదాన కార్యక్రమంలో పాల్గొంటూ సేవలందిస్తున్నారు. శనివారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాలర్స్ దివాకర్‌రెడ్డి దంపతులు కూడా అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు సేవలందించారు.

టీడీపీలోకి చక్రాల ఉష



నారా లోకేశ్‌తో చక్రాల ఉష

తిరుపతి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు వైసీపీ కండువా కప్పుకున్న తెలుగు మహిళ జిల్లా మాజీ అధ్యక్షురాలు చక్రాల ఉష తిరిగి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. శనివారం విజయవాడలో టీడీపీ యువనేత, మంత్రి నారా లోకేశ్‌ను ఆమె తన కుటుంబ సభ్యులతో కలిశారు. ఎన్నికల ముందు జరిగిన పరిణామాల గురించి ఆలోచించకుండా మునుపటిలా పార్టీలో చురుగ్గా వ్యవహరించాలని ఈ సందర్భంగా లోకేశ్ దిశా నిర్దేశం చేసినట్టు తెలిసింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు ఫోన్ చేసి ఆమెను పార్టీలోకి ఆహ్వానించమని సూచించినట్లు సమాచారం. ఆమె పల్లాను కలిసిన పరిస్థితిని వివరించారు.

జిల్లా సీసీఎఫ్‌గా సెల్వం

మంగళం, అక్టోబరు 5: జిల్లా సీసీఎఫ్‌గా సెల్వంకు అదనపు బాధ్యతలు అప్పగించారు. రాష్ట్ర వ్యాప్తంగా అటవీశాఖకు చెందిన ఐఎఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. తిరుపతి జిల్లా సీసీఎఫ్ నాగేశ్వరరావును కేంద్ర కార్యాలయంలో వర్కింగ్‌ప్లాన్ సీసీఎఫ్‌గా బదిలీ చేశారు. తిరుపతి ఎస్వీ జూపార్కు క్యూరేటర్ సెల్వంను జిల్లా సీసీఎఫ్‌గా పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టాలని ఉత్తర్వులు జారీ చేశారు. అన్నమయ్య జిల్లాలో డీఎస్‌వోగా పనిచేస్తున్న వివేక్‌ను తిరుపతి డీఎఫ్‌వోగా బదిలీ చేశారు. రంపచోడవరం డీఎఫ్‌వోగా విధులు నిర్వహిస్తున్న నరేంధిరన్‌ను తిరుపతి బయోట్రీమ్ స్టేట్ సిల్వికల్చరిస్టుగా నియమించారు.

తిరుమల నడక మార్గంలో గుర్తుతెలియని మృతదేహం



తిరుమల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): తిరుమల కాలినడక మార్గంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. అలిపిరి కాలినడక మార్గంలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి ఎగువభాగంలోని అన్నమయ్య మార్గంలో సుమారు 55ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి మృతదేహం ఉండడాన్ని కొందరు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో టూటౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ వ్యక్తి దాదాపు 10 రోజుల క్రితమే మృతి చెంది ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఎలా మృతిచెందాడనే అంశంపై దర్యాప్తు చేస్తున్నారు.

భక్తులను విచారించిన విజిలెన్స్



తిరుమల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): అన్న ప్రసాదాల్లో జెర్రి వచ్చిందంటూ మీడియాతో మాట్లాడిన వరంగల్ యువకులను విజిలెన్స్ అధికారులు క్యూలైన్‌లో విచారించారు. తాము తినే పెరుగన్నంలో జెర్రి వచ్చిందని చందు అనే భక్తుడు శనివారం మధ్యాహ్నం మీడియా ముందు వెల్లడించి ఆ తర్వాత దర్శనానికి వెళ్లిపోయారు. అయితే విషయం పెద్దది కావడంలో అసలు ఏం జరిగిందో తెలుసుకునేందుకు శనివారం రాత్రి విజిలెన్స్ అధికారులు నారాయణగిరి ఉద్యానవనంలోని షెడ్లలో ఉన్న ఆ యువకులను ప్రశ్నించారు. ఎప్పుడు తిరుమలకు వచ్చారు, ఎన్ని గంటలకు అన్నప్రసాదాలు తినేందుకు వెళ్లారు, జెర్రిని ఎలా గుర్తించారు, ఎవరికి తొలుత ఫిర్యాదు చేశారనే అంశాలపై ఆరా తీశారు.

గొడుగుల ఊరేగింపులో భక్తులు కానుకలివ్వొద్దు: టీటీడీ

తిరుమల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో గరుడసేవ రోజున అలంకరించేందుకు చెన్నై నుంచి తిరుమలకు చేరుకునే గొడుగుల ఊరేగింపులో భక్తులు ఎలాంటి కానుకలు ఇవ్వొద్దని టీటీడీ శనివారం ఓ ప్రకటన ద్వారా కోరింది. భక్తులు అందించే కానుకలు టీటీడీకి చేరవని, ఆ కానుకలతో టీటీడీకి ఎలాంటి సంబంధం లేదని తెలిపింది. తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల సమయంలో పలు హిందూ సంస్థలు చెన్నై నుంచి గొడుగులను ఊరేగింపుగా తిరుమలకు తీసుకువచ్చి స్వామికి సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ గొడుగులు 7వ తేదీన తిరుమలకు చేరుకుంటాయని టీటీడీ తెలిపింది.

శ్రీవారి సేవలో ప్రముఖులు




ఆలయం ముందు రామ్మోహన్‌నాయుడు, గల్లా జయదేవ్, బొజ్జల సుధీర్‌రెడ్డి



నటుడు సప్తగిరి

తిరుమల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త గల్లా జయదేవ్, ఎమ్మెల్యేలు బొజ్జల సుధీర్ రెడ్డి, గురజాల జగన్మోహన్, ప్రశాంతిరెడ్డి, గల్లా మాధవి, రామకృష్ణ, బొండా ఉమామహేశ్వరరావు, మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఎస్ కల్గొంకర్, పొల్యూషన్ బోర్డు చైర్మన్ జస్టిస్ గోవిందరాజన్, మాజీ ఈవో ఎల్వీ సుబ్రహ్మణ్యం, డీజీ గోపినాథ్‌జెట్టి, ఎన్నికల కమిషనర్ ముకేష్‌కుమార్ మీనా ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.











గజ వాహనంపై గజలక్ష్మిగా దర్శనమిస్తున్న ఎల్లమ్మ - ఉగ్రప్రత్యంగిరాలయంలో చంద్రఘంట అలంకరణలో అమ్మవారు - చిన్నగొట్టిగల్లులో అన్నపూర్ణా దేవిగా తిరుపతి గంగమ్మ - గాయత్రీదేవిగా శక్తిచాముండేశ్వరీదేవి - ధూమావతి అలంకారంలో మరకతశక్తి కాళీ అమ్మవారు

గజలక్ష్మిగా దర్శనమిచ్చిన ఎల్లమ్మ

చంద్రగిరి, అక్టోబరు 5: చంద్రగిరిలోని మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా రెండవ రోజు శనివారం రాత్రి ఎల్లమ్మ గజలక్ష్మి అలంకరణలో గజ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, ఈవో మమత, ఉభయదారులు బోయిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, రవికుమార్‌రెడ్డి, మల్లయ్యపల్లె గ్రామస్తులు, బి.శ్రీనివాసులురెడ్డి, కమిటీ సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. శ్యామలాంబ సమేత మల్లేశ్వరాలయ ఆవరణలోని సంతోషిమాత అన్నపూర్ణదేవిగా, తొండవాడలోని ఉగ్రప్రత్యంగిరాదేవి చంద్రఘంట అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పీఠాధిపతి సూరిస్వామి, భక్తులు పాల్గొన్నారు.

అన్నపూర్ణా దేవి అలంకరణలో తిరుపతి గంగమ్మ

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు చెరువు కట్టపై వెలసిన తిరుపతి గంగమ్మ అన్నపూర్ణా దేవిఅలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

గాయత్రీదేవిగా చాముండేశ్వరీదేవి

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటక్రాస్‌లో ఎల్ఎస్‌నగర్‌లోని శ్రీశక్తిచాముండేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారు గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఆలయధర్మకర్త బిరుదాల భాస్కర్‌రెడ్డి, ఉభయదారులు ఎస్.భాస్కర్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ధూమావతి అలంకారంలో మరకతశక్తి కాళీ అమ్మవారు

రామచంద్రాపురం, అక్టోబరు 5: శ్రీశక్తిపీఠంలో మరకతశక్తి కాళీ అమ్మవారు శనివారం ధూమావతి అలంకారంలో భక్తులను కటాక్షించారు. అలాగే రాయలచెరువుకట్ట జలకంఠేశ్వరస్వామి ఆలయంలో వెలసిన భవానీ అమ్మవారు, మహాలక్ష్మి అమ్మవారు అన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.





రాంభగీచ వద్ద ప్రవహిస్తున్న నీరు - వర్షంలో తడుస్తూ వెళుతున్న భక్తులు

తిరుమలలో భారీ వర్షం

శ్రీవారి ఆలయ ధ్వజస్తంభం వద్ద నిలిచిన నీరు

తిరుమల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శనివారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ కాసినప్పటికీ 30 నిమిషాల వ్యవధిలోనే నల్లటి మేఘాలు తిరుమలను కప్పేశాయి. మధ్యాహ్నం 12.30 గంటలకు మొదలైన వర్షం 2 గంటల వరకు కురిసింది.శ్రీవారి ఆలయంతో పాటు మాడవీధులు, గ్యాలరీలు, రోడ్లు తడిచిముద్దయ్యాయి.లోతట్టుప్రాంతాలు జలమయమయ్యాయి. శ్రీవారి దర్శనానికి వెళ్లే భక్తులతో పాటు దర్శనం పూర్తిచేసుకుని ఆలయం వెలుపలకు వచ్చిన భక్తులు కూడా వర్షంలో తడుస్తూనే వెళ్లారు. వృద్ధులు, చిన్నపిల్లలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాహనదారులు కూడా వర్షంలో ఇక్కట్లు ఎదుర్కొన్నారు. ఆలయంలోని ధ్వజస్తంభం వద్ద కూడా వర్షపు నీరు భారీగా నిలిచింది. దీంతో పైప్ సహాయంతో నీటిని వేగంగా ఆలయం బయటకు తరలించారు.సాయంత్రం 4 గంటల సమయానికంతా నీరు మొత్తం కాలువల ద్వారా వెళ్లిపోవడంతో పాటు తేమ ఆరిపోయింది. దీంతో రాత్రి వాహనసేవకు వచ్చిన భక్తులు ఎలాంటి ఇబ్బంది లేకుండా గ్యాలరీల్లో కూర్చోగలిగారు.

సీఎంను కలిసిన టీడీపీ తిరుమల నాయకులు



శ్రీవారి చిత్రపటాన్ని సీఎంకు అందజేస్తున్న తిరుమల కార్యకర్తలు

తిరుమల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): తిరుమల టీడీపీ నాయకులు శనివారం సీఎం చంద్రబాబును కలిశారు. సీఎం శనివారం ఉదయం పద్మావతి అతిథిగృహం నుంచి తిరుగు ప్రయాణమవుతూ అక్కడ వేచిఉన్న పార్టీ కార్యకర్తలను చూశారు. వెంటనే వారిని పంపాలని భద్రతా సిబ్బందిని ఆదేశించారు. టీడీపీ తిరుమల అధ్యక్షుడు రాజుయాదవ్ ఇతర కార్యకర్తలు సీఎం దగ్గరకు చేరుకుని తిరుమల స్థానికులకు సంబంధించి పలు సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. శ్రీవారి చిత్రపటాన్ని అందజేశారు. వీరితో పాటు టీడీపీ ఇంచార్జ్ సుగుణమ్మ, తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహయాదవ్, నాయకులు కోడూరు బాలసుబ్రహ్మణ్యం, తిరుమల నేతలు శివషణ్ముగం, దేవరాజ్, ఆనంద్‌బాబు, కృష్ణ, శేఖర్, కొండా రవి, పవన్‌కుమార్, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

అమ్మవారి సేవలో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

తిరుచానూరు, అక్టోబరు 5: తిరుచానూరు పద్మావతి అమ్మవారిని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు శనివారం దర్శించుకున్నారు. వేదపండితులు అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయనతోపాటు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. మంత్రి రామ్మోహన్‌నాయుడిని ఎడిపై స్కూల్ డైరెక్టర్ ప్రణీత్, సిబ్బంది ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.2.60 కోట్లు

తిరుమల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.2.60 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించి, శనివారం ఉదయం ప్రకటించింది. శుక్రవారం 54,866 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 28,657 మంది తలనీలాలు సమర్పించారు.

బెదిరింపు మెయిల్‌పై కేసు నమోదు

ఏర్పేడు, అక్టోబరు 5: విమానాశ్రయాలపై దాడి చేస్తున్నట్లు రెండు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తి నుంచి మెయిల్ వచ్చిన నేపథ్యంలో విమానాశ్రయ అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ మేరకు ఏర్పేడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏర్పేడు సీఐ జయచంద్ర కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

చిన్నశేష, హంస వాహనాలపై కళ్యాణ వెంకన్న చిద్విలాసం



తిరుపతి రూరల్, అక్టోబరు 5: తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలోని కళ్యాణ వేంకటేశ్వరస్వామిఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవరోజు శనివారం ఉదయం చిన్నశేష వాహనంపై శ్రీకృష్ణుడిగా, రాత్రి హంస వాహనంపై సరస్వతిదేవి అలంకరణలో స్వామివారు ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామస్తులు కర్పూర హారతులు పట్టారు. కళాకారులు దేవతామూర్తుల రూపాలను ధరించి భక్తులను ఆకర్షించారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం సేవను కన్నులపండుగగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి, లక్ష్మి దంపతులు, మోహిత్‌రెడ్డి, హర్షిత్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శనివారం పూజలు

భాకరాపేట, అక్టోబరు 5: పెరటాసి మాసం మూడవ శనివారం పండుగను చిన్నగొట్టిగల్లు మండల ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పెద్దఎత్తున చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు రాగదీపాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.

దుర్గసముద్రంలో రోజంతా రామభజన



గరుత్మంతుడిపై శ్రీనివాసుడు

తిరుపతి రూరల్, అక్టోబరు 5: పెరటాసి నెల మూడవ శనివారాన్ని పురస్కరించుకుని తిరుపతి రూరల్ మండలం దుర్గసముద్రంలోని శ్రీరాముడి ఆలయంలో రోజంతా నిరంతరాయంగా హరేరామ భజనని వేడుకగా నిర్వహించారు. స్థానికంగా ఉన్న ఐదుగ్రామాలకు చెందిన భక్తులు శుక్రవారం సాయంత్రం 6 గంటలనుంచి శనివారం 6గంటలవరకు 24గంటలపాటు నిరంతరాయంగా శ్రీరామభజన చేశారు. సాయంత్రం స్వామివారిని గరుత్మంతుడి వాహనంపై కొలువుదీర్చి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి యు.మునిశేఖర్, చిన్ని, విజయ్‌కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు. అలాగే శరన్నవరాత్రుల్లో భాగంగా గ్రామదేవత మూలస్థానమ్మని అన్నపూర్ణేశ్వరిగా అలంకరణ చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ధర్మకర్త నీలావతమ్మ, అర్చకులు మూర్తి గురుకుల్, తదితరులు పాల్గొన్నారు.

వంట మాస్టర్ హత్య

ఏర్పేడు, అక్టోబరు 5: వంట మాస్టర్ హత్యకు గురైన ఘటన మండలంలో శనివారం ఉదయం వెలుగు చూసింది. ఏర్పేడు సీఐ జయచంద్ర వివరాల మేరకు.. రేణిగుంట మండలం కొత్తూరు పంచాయతీ మొగలపూడి దళితవాడకు చెందిన ప్రవీణ్(35) వంట మాస్టర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈనెల 4వ తేదీ డ్యూటీకి వెళ్లిన ఆయన తిరిగి రాలేదు. ఆ క్రమంలో ఎరకలింగేశ్వరస్వామి ఆలయ పూజారి ధర్మారెడ్డి శనివారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకోవడానికి మామిడి తోటకు వెళ్లాడు. అక్కడ రక్తపు మడుగులో పడి ఉన్న మృతదేహాన్ని గుర్తించి, 100కు ఫోన్ చేసి సమాచారం అందించాడు. ఏర్పేడు సీఐ జయచంద్ర ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ప్రవీణ్‌గా గుర్తించి పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అతని ఒంటిపై 13 కత్తిపోట్లు ఉన్నట్లు గుర్తించారు. ప్రవీణ్ భార్య వెన్నెల కీర్తి ఫిర్యాదుతో ఏర్పేడు సీఐ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.





ప్రవీణ్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ జయచంద్ర - ప్రవీణ్ (ఫైల్ ఫొటో)

తిరుపతి నుంచి అంతర్జాతీయ విమానాలే లక్ష్యం



ఢిల్లీకి టిక్కెట్టు కొనుగోలు చేస్తున్న కేంద్రమంత్రి

రేణిగుంట, అక్టోబరు 5: తిరుపతి విమానాశ్రయం నుంచి అంతర్జాతీయ విమానాలు నడపడమే ఎన్డీయే ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. ఇక్కడి నుంచి గల్ఫ్, మస్కట్, కువైట్ దేశాలకు చాలామంది వెళుతుంటారని, వారి విన్నపం మేరకు అంతర్జాతీయ విమానాల రాకపోకలే లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు. శనివారం తిరుపతి విమానాశ్రయంలో ఢిల్లీ, తిరుపతి డైరెక్ట్ ఫ్లైట్‌ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. మొదటి టిక్కెట్‌ను కొనుగోలు చేశారు. విమానాశ్రయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ ప్రపంచ దేశాల నుంచి శ్రీవారిని దర్శించుకునేందుకు భక్తులు తిరుపతి విమనాశ్రయానికి వచ్చి వెళుతుంటారని, ఈ విషయాన్ని గుర్తించి అప్పటి ఎన్డీయే ప్రభుత్వ హయాంలో చంద్రబాబు తిరుపతి విమానాశ్రయాన్ని నిర్మించడమేగాకాకుండా అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దారని తెలిపారు. ముంబై, కోయంబత్తూరు, షిరిడీ, కోల్‌కతా నగరాలకు నేరుగా విమానాల రాకపోకలకు సంబంధించి చర్చలు జరుగుతున్నాయని చెప్పారు. అంతకుముందు విమానాశ్రయ ముందు భాగంలో మొక్కలు నాటారు. ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా చైర్మన్ సురేష్, రీజినల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌జీ ఫణిక్కర్, తిరుపతి ఎయిర్‌పోర్టు డైరెక్టర్ శ్రీనివాసరావు మన్నే, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వారాహి డిక్లరేషన్‌తో పవన్‌పై గౌరవం పెరిగింది

ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు



రేణిగుంట, అక్టోబరు 5: వారాహి డిక్లరేషన్‌తో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై మరింత గౌరవం పెరిగిందని ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు అభిప్రాయపడ్డారు. తిరుపతి విమానాశ్రయం వద్ద శనివారం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడుతూ తిరుపతిలో పవన్ ప్రసంగంపై తమిళనాడులో కేసు రిజిస్టర్ అయినప్పటికీ ఇబ్బందులేమీ ఉండవని స్పష్టం చేశారు. అన్ని మతాలనూ గౌరవిస్తాను, తన సనాతన ధర్మాన్ని ప్రేమిస్తానని అందరికీ అర్థమయ్యే భాషలో పవన్ చెప్పారని, ఒకవేళ వారికి ఆయన చెప్పింది అర్థంగాక ఫిర్యాదు చేసి ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. తిరుమలలో తన కూతురి చేత డిక్లరేషన్ ఇప్పించడం ఆయన నిబద్ధతకు నిదర్శనమన్నారు.

తేనె తెస్తానని తిరిగిరాని లోకాలకు..



వెంకటరమణ (పాతచిత్రం)

శ్రీకాళహస్తి, అక్టోబరు 5: తేనెకోసం వెళ్లి మృత్యువాత పడిన ఘటన శ్రీకాళహస్తి మండలంలోని ముళ్లపూడి ఎస్టీకాలనీలో శనివారం చోటుచేసుకుంది. మృతుడి భార్య వివరాల మేరకు.. ముళ్లపూడి ఎస్టీకాలనీకి చెందిన వెంకటరమణ(35) చుట్టుపక్కల ప్రాంతాల్లో తేనె సేకరించి, కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రెండు రోజుల క్రితం తేనె సేకరించేందుకు ఇంటి నుంచి వెళ్లిన ఆయన తిరిగి రాకపోవడంతో భార్యాపిల్లలు వెతకడం ప్రారంభించారు. ఈ క్రమంలో శనివారం కాలనీకి సమీపంలోని బావిలో శవమై తేలాడు. బావి పక్కనే చెట్టుపై తేనెపట్టును తీయబోతూ నీటిలో పడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి, పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. నలుగురు ఆడపిల్లలతో రోడ్డునపడ్డ భాగ్యమ్మ గుండెలవిసేలా రోదించడం అందరినీ కంటతడి పెట్టించింది.

దారి దోపిడీ కేసులో ముగ్గురి అరెస్టు

సెల్‌ఫోన్, ఆటో, మోటారు సైకిల్ స్వాధీనం



దారి దోపిడీ నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 5: తిరుపతి సమీపంలో ఇటీవల జరిగిన దారి దోపిడీ కేసులో ముగ్గురు నిందితులను వెస్ట్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. వారి నుంచి సెల్‌ఫోన్, ఆటో, మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి డీఎస్పీ వెంకటనారాయణ కథనం మేరకు.. తిరుపతికి గ్రాండ్ రిడ్జ్ హోటల్లో పనిచేస్తున్న పంచం దేబ్‌నాథ్ ఈనెల ఒకటో తేదీన తన సొంత ఆటోలో ఇంటికి వెళుతుండగా రేణిగుంట మండలం కరకంబాడికి చెందిన పెనుగొండ వెంకటేష్, చంద్రగిరి మండలం పాత శానంబట్లకు చెందిన 16ఏళ్ల బాలుడు, నెల్లూరు జిల్లా స్టోన్‌హౌస్ పేటకు చెందిన మరో 16ఏళ్ల బాలుడు బైక్‌లో వచ్చి బెదిరించి సెల్‌ఫోన్, ఆటోను తీసుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు వెస్ట్ సీఐ రామకృష్ణ, ఎస్ఐలు బాలకృష్ణ, అనిల్‌కుమార్, ఏఎస్ఐలు సురేంద్ర, షణ్ముగం దర్యాప్తు చేపట్టారు. అలిపిరి-గరుడ సర్కిల్ రోడ్డులో తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన వెంకటేష్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. అతను నేరం అంగీకరించాడు. అతనితో పాటు మరో ఇద్దరు బాలురను అరెస్టు చేశారు. వారి నుంచి సెల్‌ఫోన్, ఆటో, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. వెంకటేష్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. బాలురను జువైనల్ హోంకు అప్పగించారు.

అన్యమతగుర్తులతో తిరుమలకు వచ్చిన కారు

తిరుమల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా అన్యమతానికి చెందిన గుర్తులతో శనివారం ఓ కారు తిరుమలకు వచ్చింది. సాధారణంగా హిందూ మతానికి చెందినవి తప్ప ఇతర మతానికి చెందిన గుర్తులు, జెండాలు, చిహ్నాలతో తిరుమలకు రావడం నిషేధం. వీటిని అలిపిరి చెక్‌పాయింట్‌లోనే గుర్తించి అడ్డుకోవాల్సి ఉంటుంది. అయితే సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా సర్వమతాలకు చెందిన గుర్తులతో కూడిన స్టిక్కర్‌తో ఓ కారు శనివారం తిరుమలకు వచ్చింది. ఎస్ఎస్‌జీహెచ్ విశ్రాంతి భవనం ముందు కారును కొందరు వ్యాపారులు గుర్తించి విజిలెన్స్ అధికారులకు సమాచారమిచ్చారు. దీంతో వారు అక్కడికి చేరుకుని స్టిక్కర్‌ను తొలగించారు.





అన్యమత గుర్తుతో వచ్చిన కారు

గాయత్రీదేవిగా గంగమ్మ


గాయత్రీదేవిగా తాతయ్యగుంట గంగమ్మ

తిరుపతి(కల్చరల్), అక్టోబర్ 5: తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అమ్మవారికి గాయత్రీదేవి అలంకరణలో ఊంజలసేవ నిర్వహించారు. నూతన ఈవోగా బాధ్యతలు చేపట్టిన జయకుమార్‌ని రాయలసీమ రంగస్థలి సభ్యులు సత్కరించారు. అలాగే తిరుపతి కపిల తీర్థం ఆలయంలో జరుగుతున్న నవరాత్రి వేడుకలలో భాగంగా శనివారం ఉదయం కామాక్షి, కపిలేశ్వరులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం సాయంత్రం 6-7 గంటల మధ్య అమ్మవారి ఊంజలసేవ నిర్వహించారు. శనివారం కామాక్షి అమ్మవారు ఆదిపరాశక్తి రూపంలో భక్తులను అనుగ్రహించారు.

కాత్యాయనీదేవి అలంకరణలో...

తిరుపతి అర్బన్, అక్టోబరు 5: స్థానిక లక్ష్మీపురం కూడలిలోని అన్నపూర్ణదేవి సమేత కాశీ విశ్వనాథస్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మూడో రోజు శుక్రవారం రాత్రి అమ్మవారు కాత్యాయనిదేవి దర్శనమిచ్చారు. ప్రత్యేకంగా తయారుచేసిన ప్రసాదాలను భక్తులకు వితరణ చేశారు. శనివారం కావడంతో అధికసంఖ్యలో భక్తులు దర్శనం చేసుకున్నారు.


కాత్యాయనిదేవి అలంకరణలో దర్శనమిచ్చిన అన్నపూర్ణదేవి

నేడు జక్కదొన కథా సంపుటి ఆవిష్కరణ

తిరుపతి(కల్చరల్), అక్టోబర్ 5: తిరుపతికి చెందిన ప్రముఖ కథారచయిత ఆర్‌సీ కృష్ణస్వామి రాజు రచించిన జక్కదొన కథాసంపుటి ఆవిష్కరణ సభ ఆదివారం ఉదయం 10.30 గంటలకు జరుగుతుంది. శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం ప్రాచ్య పరిశోధన సంస్థ (ఓఆర్‌ఐ) ఆధ్వర్యంలో వర్సిటీ సెనేట్ హాల్లో సభ జరుగుతుంది. ముఖ్యఅతిధిగా వర్సిటీ ఉపకులపతి ఆచార్య సీహెచ్ అప్పారావు హాజరవుతారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి కె.ఎస్. శ్రీనివాస రాజు పుస్తకావిష్కరణ చేస్తారు. గౌరవ అతిథిగా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఎం.భూపతినాయుడు, ప్రత్యేక అతిథిగా చెన్నయ్ రాజధాని కళాశాల తెలుగు శాఖాధ్యక్షులు ఎస్ ఎలిజబెత్ జయకుమారి హాజరవుతారు. ఓఆర్‌ఐ సంచాలకులు ఆచార్య పీసీ వెంకటేశ్వర్లు అధ్యక్షత వహిస్తారు. గరికపాటి రమేష్ బాబు పుస్తక సమీక్ష చేస్తారని రచయిత కృష్ణస్వామి రాజు ఒక ప్రకటనలో తెలిపారు.

నవోదయ విద్యాలయాల్లోని ఖాళీసీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(విద్య), అక్టోబరు 5: నవోదయ విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకుగాను విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గురుస్వామిరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికిగాను 9, 11 తరగతుల్లోని ఖాళీలను భర్తీ చేయనున్నట్టు వెల్లడించారు. 9వ తరగతిలో చేరదలచినవారు 2024-25 విద్యా సంవత్సరంలో 8వ తరగతి చదువుతూ ఉండాలని, 1-5-2010 నుంచి 31-7-2012 లోపల జన్మించి ఉండాలని, 11వ తరగతిలో చేరదలచినవారు ప్రస్తుతం 10వ తరగతి చదువుతూ ఉండాలని, 1-6-2008 నుంచి 31-7-2010వ సంవత్సరం లోపల జన్మించి ఉండాలని వెల్లడించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు మాత్రమే ఈనెల 30వ తేదీ లోపల దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.నవోదయ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులు పొందొచ్చని తెలిపారు.

బాలిక పట్ల అసభ్య ప్రవర్తన : ఒకరి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 5: బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటనలో నిందితుడిని ఎంఆర్ పల్లి పోలీసులు అరెస్టు చేసిన ఘటన శనివారం జరిగింది. సీఐ చిన్నగోవిందు కథనం మేరకు... తిరుపతి రూరల్ మండలానికి చెందిన తొమ్మిదేళ్ల బాలికను ఇంటి పక్కన కాపురముంటూ బేల్దారి పని చేసుకుని జీవిస్తున్న గూడూరు వాసి ప్రసాద్ తన ఇంట్లోకి పిలిచి అశ్లీల చిత్రాలు చూపించాడని బాలిక తల్లిదండ్రులు ఎంఆర్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతకు మునుపే ప్రసాద్‌కు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు సీఐ చిన్నగోవిందు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

రివర్స్ టెండరింగ్ రద్దు శుభపరిణామం



తిరుపతి (జీవకోన), అక్టోబరు 5: గత వైసీపీ పాలకులకు అక్షయపాత్రగా మారిన రివర్స్ టెండరింగ్‌ను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం చంద్రబాబు రద్దుచేయడం శుభపరిణామమని బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ టీటీడీలో సైతం రాష్ట్ర ప్రభుత్వం మాదిరిగా రివర్స్ టెండరింగ్ విధానాన్ని రద్దు చేస్తూ ఈవో శ్యామలరావు ఆదేశాలు ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. టీటీడీలో గత మూడు సంవత్సరాలుగా ఎన్ని టెండర్లు జరిగాయి.. వాటిలో పనులు ప్రారంభం కాని కోట్లాది రూపాయల సివిల్ ఇంజనీరింగ్ పనులను రద్దు చేస్తే శ్రీవారి ఖజానాకు కోట్లాది రూపాయల లాభం చేకూరుతుందని గత వారం టీటీడీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఎట్టకేలకు రివర్స్ టెండరింగ్ విధానాన్ని రద్దు చేసి శ్రీవారి సొమ్మును సంరక్షించిన ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరికి, చీఫ్ ఇంజనీర్ వెంకట సత్యనారాయణకు నవీన్‌కుమార్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీపద్మావతి స్కూల్ ఆఫ్ ఫార్మశీలో జాతీయ శిబిరం



తిరుపతి(వైద్యం), అక్టోబరు 5: తిరుపతిలోని శ్రీపద్మావతి స్కూల్ ఆఫ్ ఫార్మశీలో ఒక రోజు జాతీయ శిబిరం శనివారం జరిగింది. ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ (ఐక్యూఏసీ) ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ఫార్మాసూటికల్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీటీఏ) సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది. ఫార్మాస్యూటికల్ ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్ అండ్ ఇంటెలిజెన్స్ స్కిల్స్ అనే విషయంపై జరిగిన ఈ వర్క్‌షాప్ ఎను ముఖ్య అతిథి ఏపీటీఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె.వెంకట రమణ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. కార్యక్రమంలో మహిళా వర్శిటీ సొసైటీ ఫర్ ఇన్నోవేషన్ ఇంక్యుబేషన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఎ-టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్ సీఈఓ డాక్టర్ జె.సూర్యకుమార్, శ్రీపద్మావతి విద్యాసంస్థల అధిపతి పి.సులోచన, డైరెక్టర్ పి.ప్రణీత్, ప్రిన్సిపల్ డాక్టర్ రంగనాయకులు, అధ్యాపకులు బి ఫార్మశీ, ఎం ఫార్మశీ, ఫార్మ్ డి విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన జేబీ శ్రీనివాస్



తిరుపతి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించి తిరుగు ప్రయాణమైన ముఖ్యమంత్రి చంద్రబాబును శనివారం రేణిగుంట విమానాశ్రయంలో టీడీపీ నేత జేబీ శ్రీనివాస్ కలిశారు. గత ఐదేళ్లు వైసీపీ నాయకులతో తీవ్ర ఇబ్బందులు పడ్డామని, పదవుల్లో న్యాయం చేయాలని జేబీ విజ్ఞప్తి చేశారు. పార్టీ కోసం కష్టపడ్డవారికి తప్పకుండా న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చినట్టు తెలిసింది.

సీఎన్జీ తొలి బైక్ ఆవిష్కరణ


నూతన బైక్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

తిరుపతి అర్బన్, అక్టోబరు 5: తిరుపతిలోని ఎయిర్‌బైపాస్‌రోడ్డు ఎంజీబీ షోరూంలో దేశంలోనే తొలిసారిగా సీఎన్జీ ద్విచక్ర వాహనాన్ని శనివారం సాయంత్రం ఆవిష్కరించి మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంజీబీ ఎండీ శ్రీనివాస్ మాట్లాడుతూ పెట్రోల్‌తో పోలిస్తే బజాజ్ ఫ్రీడమ్ సీఎన్జీ బైక్ ద్వారా 50శాతం ఖర్చు తగ్గుతుందన్నారు. ఈ బైక్ తాజా సాంకేతిక పరిజ్ఞానంతో తయారుచేయబడి అధునాతన సదుపాయాలు కల్గి ఉందన్నారు. పొడవైన మెత్తటిసీటు, ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్, ఎలక్ట్రిక్ స్పీడోమీటర్, బ్లూటూత్ సౌకర్యం కలిగివుంది. ఫ్రీడమ్ 125సీసీ డ్రం ఎక్స్ షోరూం ప్రైజ్ రూ.90వేలు, డ్రం ఎల్ఈడీ రూ.1.05లక్షలు, డిస్క్ఎల్ఈడీ రూ.1.10లక్షల ధరలతో ఐదు రంగులలో అందుబాటులో ఉన్నాయన్నారు. సీఎన్జీ రీజనల్ హెడ్ గౌతమ్‌ఆనంద్ మాట్లాడుతూ జిల్లాలో 16సీఎన్జీ పంప్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. త్వరలో మరిన్ని రాబోతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మునిరెడ్డి, కె.ఎల్. సందీప్, మురళీకృష్ణారెడ్డి, రాజబోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారి తీరుపై మీడియా నిరసన
క్షమాపణ చెప్పిన అధికారులు


తిరుపతి అర్బన్ ఎక్సైజ్ సీఐ కార్యాలయం వద్ద బైఠాయించి ఆందోళన చేస్తున్న జర్నలిస్టులు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 5: ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసాచారి జర్నలిస్టుల పట్ల వ్యవహరించిన తీరును నిరసిస్తూ శనివారం తిరుపతి అర్బన్ ఎక్సైజ్ సీఐ కార్యాలయం వద్ద జర్నలిస్టులు ఆందోళన చేశారు. తిరుపతి అర్బన్ ఎక్సైజ్ సీఐ కార్యాలయం వద్ద శనివారం ఉదయం 9 గంటలకు ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా మీడియా సమావేశం ఉందంటూ శుక్రవారం జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వర రెడ్డి తిరుపతిలోని మీడియా ప్రతినిధులందరికీ వాట్సాప్ సందేశాలు పంపారు. అక్కడకు వెళ్లిన మీడియా ప్రతినిధులు రెండు గంటలకు పైగా ఎదురు చూడాల్సి వచ్చింది. సీఎంతో ఉండడం వల్ల మీనా రాలేకపోయారు. ఆ సమాచారం మీడియాకు సరిగా ఇవ్వకపోవడంతో వారు ప్రశ్నించారు. ఈసందర్భంగా ఏసీ శ్రీనివాసాచారి తమ పట్ల దురుసుగా వ్యవహరించారంటూ ఆందోళనకు దిగారు. ఈవిషయాన్ని మీడియా ప్రతినిధులు మంత్రి కొల్లు రవీంద్ర, ముఖ్య కార్యదర్శి ముకేష్‌కుమార్ మీనా దృష్టికి ఫోన్ ద్వారా తీసుకెళ్లారు. విచారించి చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చారు. అనంతరం ఎక్సైజ్ డీసీ విజయశేఖర్, ఏసీలు బాలకృష్ణన్, శ్రీనివాసాచారి, అసిస్టెంట్ ఎక్సైజ్ కమిషనర్ వాసుదేవ చౌదరి, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వర రెడ్డి అక్కడికి చేరుకుని మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. మీడియా ప్రతినిధులకు క్షమాపణలు చెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది. ఏపీయూడబ్ల్యుజే, జాప్ ఆధ్వర్యంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు నిరసనలో పాల్గొన్నారు.

మద్యం టెండర్ల ద్వారా భారీ ఆదాయం సమకూర్చాలి
ఎక్సైజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముకేష్‌కుమార్ మీనా



తిరుపతి అర్బన్ ఎక్సైజ్ సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్లను పరిశీలిస్తున్న మీనా

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 5: మద్యం టెండర్ల ద్వారా ప్రభుత్వానికి భారీ ఆదాయం సమకూర్చేందుకు చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముకేష్‌కుమార్ మీనా అధికారులను ఆదేశించారు. శనివారం తిరుమలలో సీఎం పర్యటన అనంతరం మధ్యాహ్నం తిరుగు ప్రయాణంలో ఆయన తిరుపతి అర్బన్ ఎక్సైజ్ శాఖ సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన టెండరు దాఖలు కౌంటర్లను పరిశీలించారు. ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది సంయమనం పాటించి టెండర్లు అధిక సంఖ్యలో దాఖలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని డీసీ విజయశేఖర్‌ను ఆదేశించారు. టెండర్ల విషయంలో కానీ, మద్యం దుకాణాల కేటాయింపుల్లో పారదర్శకంగా ఉండాలన్నారు. అవసరమైన చోట అదనంగా కంప్యూటర్లు ఏర్పాటు చేసుకుని టెండరు దారులకు సహకరించాలని కోరారు. ఆయన వెంట ఏసీలు బాలకృష్ణన్, శ్రీనివాసాచారి, ఏఈఎస్ వాసుదేవ చౌదరి, ఈఎస్ నాగమల్లేశ్వర రెడ్డి, అర్బన్ సీఐ రామచంద్ర, ఎస్ఐలు ఉన్నారు.

మండే ఎండ మందుబాబుకు వెన్నెల
తిలక్ రోడ్డులో మద్యం ప్రియుడి నిద్రాసనం



తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 5: తిరుపతిలో మండే ఎండ మందుబాబుకు వెన్నెలలాగా తయారైంది. నిషా తలకెక్కి ఒళ్లు తెలియక మద్యం సేవించి నడి రోడ్డుపై పడి ఉన్న ఘటన శనివారం స్థానిక తిలక్ రోడ్డులో చోటు చేసుకుంది. ఒకవైపు శ్రీవారి బ్రహ్మోత్సవాల వేళ... సుదూర ప్రాంతాల నుంచి భక్తి శ్రద్ధలతో తిరుమలకు కాలికి చెప్పులు లేకుండా, తలపై గొడుగులు లేకుండా మూడు నామాలు పెట్టుకుని భక్తులు నడచి వెళుతుండగా, ఒక మందుబాబు మిట్ట మధ్యాహ్నం మండుటెండలో రోడ్డు మండుతున్నా ఒళ్లు తెలియక మద్యం మత్తు తలకెక్కి నడచి వెళ్లలేక తిలక్ రోడ్డులోని కూరగాయల మార్కెట్ సమీపంలో నడి రోడ్డుపై పడి పవళింపు ఆసనంలో స్వర్గానికి అంచులో ఉన్నట్లు కనిపించాడు.

నేటి నుంచి అండర్-14, 17 తైక్వాండో పోటీలు

తిరుపతి(క్రీడలు), అక్టోబరు 5: స్థానిక శ్రీనివాస క్రీడా సముదాయంలో ఆదివారం నుంచి రాష్ట్ర స్థాయి బాలబాలికల అండర్ -14, 17 తైక్వాండో పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎస్.బాబు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం 6గంటలకు పోటీలు ప్రారంభమై మంగళవారంతో ముగుస్తాయన్నారు. ప్రతిభచాటిన క్రీడాకారులను జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వివరాల కోసం 94906 20292నెంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

భక్తులకు అన్నదానం



తిరుపతి (ఎమ్మార్‌పల్లి), అక్టోబరు 5: పెరటాసి మాసం పురస్కరించుకుని స్థానిక ఎస్టీ రోడ్డులోని సీతారామాంజనేయ స్వామి దేవస్థానం వద్ద శనివారం ఆలయ నిర్వాహకుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఏవో కేవీఎల్ వర్మ, పంచాయతీరాజ్ డీఈ మురళీ, రాధాకృష్ణ వర్మ, రాజా నరేన్, ఎస్బీఐ మేనేజర్ లీలా మనోహర్‌లు పాల్గొని అన్నదాన వితరణ చేశారు. సనాతన హైందవ ధర్మాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి మిత్రులందరూ ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తుండం ఆనందంగా ఉందని కేవీఎల్ వర్మ అన్నారు. కార్యక్రమంలో ఆర్ఆర్ శ్రీనివాస్, సుజాత, పవన్, విష్ణు, మురళి, సత్యనారాయణ, ఆనంద్, చిరంజీవి, రాజులు పాల్గొన్నారు.

'పాల' రాష్ట్ర అధ్యక్షుడిగా శరత్ రాఘవేంద్ర



తిరుపతి(విద్య), అక్టోబరు 5: పాలిటెక్నిక్ ఆల్ లెక్చరర్స్ అసోసియేషన్ (పాల) రాష్ట్ర అధ్యక్షుడిగా తిరుపతి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మెకానికల్ లెక్చరర్ శరత్ రాఘవేంద్ర ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ద్వారకానాథ్‌రెడ్డి, ఏఓ గురివిరెడ్డి, విశ్రాంత సూపరింటెండెంట్ ఆనందరావు తదితరులు ఆయనను శనివారం కళాశాలలో ఘనంగా సన్మానించి, అభినందించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పాల సంఘం ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా శరత్ రాఘవేంద్ర చెప్పారు. కార్యక్రమంలో పాల్గొన్న కార్యాలయ సిబ్బంది ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు.

అంతరిక్ష పరిశోధనలపై దృష్టి సారించాలి
షార్ శాస్త్రవేత్త మూర్తి పిలుపు


షార్ శాస్త్రవేత్త మూర్తి నుంచి సర్టిఫికెట్ అందుకుంటున్న పాకనాటి వాణీప్రీతమ్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 5: అంతరిక్ష పరిశోధనలపై ఈ తరం దృష్టి సారించాలని షార్ శాస్త్రవేత్త మూర్తి పిలుపునిచ్చారు. పద్మావతి మహిళా యూనివర్సిటీలో శనివారం నిర్వహించిన అంతరిక్ష వారోత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 4 నుంచి 10వ తేదీ దాకా దేశ వ్యాప్తంగా అంతరిక్ష వారోత్సవాలు కొనసాగుతున్నట్టు ఆయన చెప్పారు. ఈ ఏడాది అంతరిక్ష - వాతావరణ మార్పులపై చర్చ సాగుతోందన్నారు. వాతావరణ సంబంధమైన సమస్యలను అర్థం చేసుకోవడానికీ, ఇలాంటి సమస్యలను పరిష్కరించడానికి అంతరిక్ష సాంకేతికత దోహదం చేస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ రజని, డీన్ కాత్యాయని, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాణీప్రీతంకు బహుమతి

అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా తిరుపతిలో ఇస్రో - షార్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పోటీల్లో తిరుపతిలోని కేంబ్రిడ్జి స్కూల్ ఎనిమిదవ తరగతి విద్యార్థి పాకనాటి వాణీప్రీతం బహుమతి పొందారు. పద్మావతి మహిళా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ ఆవరణలో అంతరిక్ష అంశంపై విద్యార్థులకు ఈ పోటీలు సాగాయి. అంతరిక్ష పరిశోధనాంశంపై చేపట్టిన మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నల పోటీలో వాణీప్రీతం అత్యుత్తమ ప్రతిభను కనబరిచి రెండవ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా షార్ శాస్త్రవేత్త నరసింహమూర్తి, పద్మావతి వర్సిటీ రిజిస్ట్రార్ రజని, డీన్ కాత్యాయిని తదితరులు వాణీప్రీతంకు సర్టిఫికెట్, జ్ఞాపిక అందజేసి అభినందించారు. కాగా, 2020లో షార్ నిర్వహించిన రాకెట్ నమూనా తయారీ పోటీల్లోనూ వాణీప్రీతం బహుమతి పొందడం గమనార్హం.

రేపటి నుంచి గుడిమల్లం కొత్త ప్యాకేజీ టూర్

తిరుపతిఅర్బన్,అక్టోబరు5:తిరుపతి నుంచి తిరుచానూరు, గుడిమల్లం కొత్త ప్యాకేజీ టూర్‌ను సోమవారం నుంచి ప్రవేశపెడుతున్నట్లు ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ డివిజనల్ మేనేజర్ గిరిధర్‌రెడ్డి శనివారం పేర్కొన్నారు. ప్రతి రోజు ఉదయం 9గంటలకు శ్రీనివాసం, విష్ణునివాసం నుంచి బస్సు బయల్దేరి గుడిమల్లం ఆలయం తరువాత తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం, సాయంత్రం 4గంటలకు తిరుపతి చేరుకుంటుంది. ఒకరికి టిక్కెట్ ధర రూ.400 ఖరారుచేశారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 9848007033 నెంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

రోడ్డు పనులు చేపట్టాలని గ్రామస్తుల ధర్నా



సత్యవేడు, అక్టోబరు 5: అధ్వానంగా మారిన సత్యవేడు - టీపీకోట రోడ్డు పనులు వెంటనే చేపట్టాలని మండలంలోని కన్నవరంలో గ్రామస్తులు శని వారం సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ సత్యవేడు - నాగలాపురం వయా టీపీకోట రోడ్డు ఏళ్లతరబడిగా అధ్వానంగా ఉందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులు ఈ ప్రాంతంలో విచ్చలవిడిగా చేపట్టిన గ్రావెల్ అక్రమ రవాణాతో రోడ్లు గుంతలుగా మారిపోయాయని పేర్కొన్నారు. ప్రధానంగా కన్నవరం, జడేరి, అల్లప్పగుంట, ఏఎంపురం, వీఆర్‌కండ్రిగ గ్రామాల్లో రోడ్లు బావులను తలపిస్తున్నాయని విచారం వ్యక్తం చేశారు. ఈ మార్గంలో పరిశ్రమలకు ద్విచక్ర వాహనాల్లో వెళ్లే కార్మికులు, వాహన చోదకులు నిత్యం తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వమైనా పట్టించుకుని రోడ్డు పనులను చేపట్టాలని కోరారు. లేనిపక్షంలో 20 గ్రామాల ప్రజలతో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టనున్నట్లు ఆయన స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు దినేష్, రాజా, గోవర్ధన్, శ్యామల, అమ్ములు, సురాజ్, మురళి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త ఎక్కడ వేయాలో చెప్పండి మహాప్రభో..!


రోడ్డుపై నిలిచిపోయిన చెత్త ట్రాక్టర్లు

రేణిగుంట, అక్టోబరు 5: రేణిగుంట మేజర్ పంచాయతీకి సంబంధించిన చెత్తను ఎక్కడ వేయాలో పంచాయతీ సిబ్బందికి అర్థం కాని పరిస్థితి నెలకొంది. రేణిగుంట పంచాయతీకి చెందిన చెత్తను ప్రతిరోజూ సిబ్బంది సేకరించి 5 ట్రాక్టర్లతో తూకివాకం పంచాయతీ పరిధిలోని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ స్థలంలో వేస్తుండేవారు. ఏమైందో ఏమో కానీ శనివారం పంచాయతీ చెత్త ట్రాక్టర్లను చెత్త వేయనివ్వకుండా కొంతమంది అడ్డుకున్నారు. దీంతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు చెత్తతో నిండిన ట్రాక్టర్లను రోడ్డుపై నిలిపేశారు. స్థానిక సర్పంచ్ నాగేశం ఈవోపీఆర్డీ వెంకటరత్నమ్మ దృష్టికి తీసుకెళ్లి తూకివాకం సెక్రటరీ, సర్పంచులతో మాట్లాడి చెత్తను తరలించారు. అయితే మళ్లీ చెత్త వేయకుండా అడ్డుకుంటేతాము ఎక్కడ చెత్త వేయాలని రేణిగుంట పంచాయతీ సిబ్బంది ప్రశ్నిస్తున్నారు. స్థానికంగా చెత్త వేసేందుకు ప్రత్యేక స్థలం చూపించాలని కోరుతున్నారు.

పీఎం కిసాన్ నిధుల విడుదల

వరదయ్యపాళెం, అక్టోబరు 5: వరదయ్యపాళెం మండలంలోని వ్యవసాయాధికారి కార్యాలయంలో శనివారం ప్రధానమంత్రి పీఎం కిసాన్ నిధులు విడుదల ప్రత్యక్ష ప్రసారాన్ని రైతులు వీక్షించేందుకు ఏర్పాట్లు చేశారు. పీఎం కిసాన్ పెట్టుబడి సాయం కింద ప్రతి నాలుగు నెలలకు రూ.2వేలు వంతున ఏడాదికి రూ.6వేలు రైతుల ఖాతాలో జమ అవుతుంది. మండలంలో 5,288మంది రైతులు ఈ పథకానికి అర్హులని ఏవో ద్వారకానాథ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ముని సుబ్రహ్మణ్యం, సిద్ధులయ్య, పురుషోత్తం, గుత్తి త్యాగరాజు, సురేష్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, వ్యవసాయ విస్తరణాధికారి ప్రవీణ్ సహాయకులు జ్యోతి, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

భక్తులతో కిటకిటలాడిన అప్పలాయగుంట



వడమాలపేట, అక్టోబరు 5: ప్రసన్న వెంకటేశ్వరస్వామి కొలువైన అప్పలాయ గుంట భక్తులతో కిటకిటలాడింది. పెరటాసి నెల మూడవ శనివారం కావడంతో భక్తులు విశేషంగా తరలివచ్చి వెంకటేశ్వరుని దర్శించుకున్నారు. దర్శనం కోసం బారులు తీరారు. అభయహస్తాదీశుడైన ప్రసన్న వెంకటేశ్వరస్వామికి పలువురు తలనీలాలు సమర్పించారు. అఖిలాండం వద్ద కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారుతులతో ముడుపులు చెల్లించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారులతో ప్రసన్న వెంకటేశ్వరుని సర్వాంగ సుందరంగా ఊయలలో అలంకరింపజేసి భక్తులు గోవిందనామ స్మరణల నడుమ ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం పద్మావతీ, ఆండాళ్ సమేత ప్రసన్న వెంకటేశ్వరుని మేళతాలలతో మాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులు నారికేళ, కర్పూర నీరజనాలు సమర్పించి స్వామి అమ్మవార్లను దర్శించారు.

అన్నపూర్ణగా వాసవీదేవి



వడమాలపేట, అక్టోబరు 5: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అన్నపూర్ణాదేవి అలంకరణలో కన్యాకాపరమేశ్వరి దర్శనమిచ్చారు. స్థానిక వాసవీ కన్యాకపరమేశ్వరి ఆలయంలో ఉదయం పంచామృత అభిషేకం చేశారు. సాయంత్రం మహిళలు లలితా సహస్ర నామార్చలనతో కుంకుమ పూజలు చేశారు. రాత్రి అమ్మవారిని గాయత్రీ దేవిగా అలంకరించారు. పురోహితులు ప్రసాద్‌వర్మ మంగళ హారుతులిచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. పూడి క్రాస్ రోడ్డు వద్ద అంకాలమ్మ ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు.

మీనాక్షి దేవి అలంకరణలో ద్రౌపది అమ్మవారు



పుత్తూరు టౌన్, అక్టోబర్ 5: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం పుత్తూరులోని ద్రౌపదిదేవి సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో అమ్మవారు మీనాక్షి దేవిగా భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమానికి ఉభయదారులుగా పట్టణానికి చెందిన విశ్వబ్రాహ్మణ సంఘం వారు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ క్రిష్టప్ప మెదలి, సభ్యులు మునిచంద్ర, దామోదరం, పురోహితులు మోహన్ పాల్గొన్నారు. ● రాచపాలెం గ్రామంలోని లక్ష్మీ కనకదుర్గమ్మ ఆలయంలో శివానందగిరి స్వామి ఆధ్వర్యంలో అమ్మవారిని గాయత్రీ దేవిగా అలంకరించి గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఉభయ దారులుగా ప్రతాప్ రాజు, ధనంజయరాజు, సత్యనారాయణ రాజు కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

ఇంటింటా తపాలా సేవలు


తపాల సేవల గురించి వివరిస్తున్న సతీష్, సిబ్బంది

పుత్తూరు టౌన్, అక్టోబరు 5: తపాలా శాఖ అందిస్తున్న పొదుపు, బీమా రక్షణ సేవలను ప్రతి ఒక్కరూ సద్వి నియోగం చేసుకోవాలని పుత్తూరు తపాల ఇన్‌స్పెక్టర్ సతీష్ తెలి పారు. శనివారం పుత్తూరు తపాలా కార్యాలయానికి వచ్చిన ఖాతాదారులకు ఇన్‌స్పెక్టర్ సతీష్, మెయిల్ ఓవర్సీర్లు మురళి, రాహుల్ తపాలా సేవల గురించి వివరించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ సోమవారం నుంచి 11వ తేదీ వరకు వారం రోజుల పాటు తపాలా వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆధార్ సేవా క్యాంపులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

కుంభాభిషేక వేడుకలు

పెళ్లకూరు, అక్టోబరు 5: మండలంలోని చెంబేడు గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామాలయంలో కుభాంభిషేకం మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి శనివారం యాగశాల మండపంలో చండీశ్వర పూజ, రుద్ర, చండీ, శాంతిహోమం నిర్వహించారు. అనంతరం శిఖర కలశస్థాపన చేశారు. సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం స్వామి అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

బెదిరింపు మెయిల్‌పై కేసు నమోదు

ఏర్పేడు, అక్టోబరు 5: విమానాశ్రయాలపై దాడి చేస్తున్నట్లు రెండు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తి నుంచి మెయిల్ వచ్చిన నేపథ్యంలో విమానాశ్రయ అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ మేరకు ఏర్పేడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏర్పేడు సీఐ జయచంద్ర కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

తిరుపతి జిల్లా సీసీఎఫ్‌గా సెల్వం

మంగళం, అక్టోబరు 5: తిరుపతి జిల్లా సీసీఎఫ్‌గా సెల్వంకు అదనపు బాధ్యతలు అప్పగించారు. తిరుపతి జిల్లా సీసీఎఫ్ నాగేశ్వరరావును కేంద్ర కార్యాలయంలో వర్కింగ్ ప్లాన్ సీసీఎఫ్‌గా బదిలీ చేశారు. తిరుపతి ఎస్వీ జూపార్కు క్యూరేటర్ సెల్వంను తిరుపతి జిల్లా సీసీఎఫ్‌గా పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టాలని ఉత్తర్వులు జారీ చేశారు. అన్నమయ్య జిల్లాలో డీఎస్‌వోగా పనిచేస్తున్న వివేక్‌ను తిరుపతి డీఎఫ్‌వోగా బదిలీ చేశారు. రంపచోడవరం డీఎఫ్‌వోగా విధులు నిర్వహిస్తున్న నరేందిరన్‌ను తిరుపతి బయోట్రీమ్ స్టేట్ సిల్వికల్చరిస్టుగా నియమించారు.

నేలపట్టు ఎఫ్ఆర్‌వోగా సౌజన్య

దొరవారిసత్రం, అక్టోబరు 5: నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్‌గా సౌజన్య శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆమె గిద్దలూరు నుంచి వచ్చారు.

టీడీపీలోకి తిరిగి చక్రాల ఉష



తిరుపతి, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ముందు వైసీపీ కండువా కప్పుకున్న తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు చక్రాల ఉష తిరిగి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. శనివారం విజయవాడలో మంత్రి నారా లోకేశ్‌ను ఆమె తన కుటుంబ సభ్యులతో వెళ్లి కలిశారు. ఎన్నికల ముందు జరిగిన పరిణామాల గురించి ఆలోచించకుండా మునుపటిలా పార్టీలో చురుగ్గా వ్యవహరించాలని ఈ సందర్భంగా లోకేశ్ దిశా నిర్దేశం చేసినట్టు తెలిసింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు ఫోన్ చేసి ఆమెను పార్టీలోకి ఆహ్వానించమని సూచించినట్లు సమాచారం. ఆమె పల్లాను కలిసిన పరిస్థితిని వివరించారు.

ఎంపీడీవో బదిలీ

ఓజిలి, అక్టోబరు 5: ఓజిలి ఎంపీడీవో రజనీకాంత్ నెల్లూరు జిల్లా అల్లూరు మండలానికి బదిలీ అయ్యారు. అదే విధంగా ఓజిలి, కురుగొండ, ఆరిమేని పాడు సచి వాలయ కార్యదర్శులు సిరాజ్, రమేష్, మస్తానయ్య చిల్లకూరు, చిట్టమూరు, గూడూరు మండలాలకు బదిలీపై వెళ్లారు.


గూడూరు: అన్నపూర్ణాదేవిగా విజయదుర్గాదేవి, గాయత్రీదేవిగా కన్యకాపరమేశ్వరి - చిల్లకూరు: శాకాంబరి అలంకారంలో ముత్యాలమ్మ, ధాన్యలక్ష్మీదేవి అలంకారంలో ఆదిలక్ష్మీదేవి - నాయుడుపేట: గాయాత్రిదేవి అలంకరణలో మూకాంబికాదేవి

ఆకట్టుకున్న అమ్మవార్ల అలంకరణ

గూడూరు, అక్టోబరు 5: దేవిశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం గూడూరు పట్టణంలోని పలు ఆలయాల్లో అమ్మవార్ల అలంకరణలు ఆకట్టుకున్నాయి. స్థానిక సాయిసత్సంగ నిలయంలోని విజయదుర్గాదేవిని, నారాయణమ్మ పేరంటాళ్ల ఆలయంలో అమ్మవారిని, రాజరాజేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా, కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని, గంగమ్మ ఆలయంలో అమ్మవారిని గాయత్రీదేవిగా, ధర్మరాజస్వామి ఆలయంలో ద్రౌపదీదేవిని బండాసురవధ అలంకారంలో, బజారుకలశంలో అమ్మవారిని చాముండేశ్వరిగా అలంకరించి పూజలు నిర్వహించారు.

చిల్లకూరు: తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ అమ్మవారిని ఉదయం శాకాంబరి అలంకారంలో ఉంచి పూజలు జరిపారు. రాత్రి గాయత్రీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించి అర్థ రథంపై గ్రామోత్సవం జరిపారు. కలకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదిలక్ష్మీదేవిని ధాన్య లక్ష్మీదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు.

వెంకటగిరి టౌన్: పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరికి మోహినీ అలంకారం, మూలవిరాట్‌కు చందన అలంకారం, హరహర క్షేత్రంలోని కాత్యాయనీ దేవిని అన్నపూర్ణ దేవిగా, వెంకటేశ్వరస్వామిని వరాహ అవతారంలో అలంకరించారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని మూకాంబికాదేవి ఆలయంలో అమ్మవారు గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే మానసాదేవి, దుర్గాదేవి, పోలేరమ్మ, కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో శరన్నవరాత్రి పూజలు జరిగాయి.

సూళ్లూరుపేట: చెంగాళమ్మ పరమేశ్వరి అన్నపూర్ణగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి మన్నారు పోలూరు, నూకలపాలెం, వట్రపాలెం నుంచి సారె సమర్పించారు. నాగేశ్వరిస్వామి ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరిగా, కన్యకాపరమేశ్వరి అమ్మవారు భువనేశ్వరిగా దర్శనమిచ్చారు.

కోట: గూడలిలో గల రామలింగ చాముండేశ్వరిని అన్నపూర్ణాదేవిగా, కోటమ్మను త్రిపురసుందరీదేవిగా, కోటలోని వాసవీకన్యకాపరమేశ్వరిని లలితాత్రిపురసుందరీ దేవిగా అలంకరించారు.


వెంకటగిరి: కన్యకాపరమేశ్వరికి మోహిని అలంకారం, అన్నపూర్ణదేవిగా కాత్యయనీ దేవి - సూళ్లూరుపేట: అన్నపూర్ణగా చెంగాళమ్మ - కోట: లలితా త్రిపురసుందరిదేవిగా కన్యకా పరమేశ్వరి, అన్నపూర్ణదేవిగా రామలింగచాముండేశ్వరి

గాయత్రీదేవిగా పార్వతీదేవి


గాయత్రిదేవిగా చిందేపల్లిలో పార్వతీదేవి, మర్రిమందలో అన్నపూర్ణగా అమ్మవారు

ఏర్పేడు, అక్టోబరు 5: ఏర్పేడు మండలంలో దేవీ నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం చిందేపల్లి సిద్దేశ్వరస్వామి ఆలయంలో పార్వతిదేవి గాయత్రిదేవిగా భక్త లకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ● మరిమందలోని మాతా సేవాశ్రమంలో అమ్మవారు అన్నపూర్ణా దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ● గుడిమల్లంలో అమ్మవారు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు.

ఉరివేసుకుని దుస్తుల వ్యాపారి మృతి

కోట, అక్టోబరు 5: కోట పట్టణంలోని బజారుసెంటర్‌లో బట్టల దుకాణం నడుపుతున్న రాజస్తాన్‌కు చెందిన దయాలాల్(62) శనివారం ఇంట్లో ఉరివేసుకుని మృతి చెందాడు. రాజస్థాన్‌కు చెందిన దయాలాల్ గత కొన్ని సంవత్సరాలుగా కోట పట్టణంలో బజారు సెంటర్‌లో రెడీమేడ్ బట్టల దుకాణం నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కుటుంబసభ్యులు ఊరికివెళ్లగా శనివారం తెల్లవారుజామున ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని దయాలాల్ మృతి చెందాడు. పక్కింట్లోని వారు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ పవన్‌కుమార్ సంఘటనాస్థలికి చేరుకొని కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పలుగోడులో వివాదాస్పద భూముల పరిశీలన

డక్కిలి, అక్టోబరు 5: మండలంలోని పలుగోడు సర్వే నెంబరు 1, 123లోని వివాదాస్పద భూములను రెవెన్యూ, అటవీశాఖ అధికారులు శనివారం పరిశీలించారు. ఈ భూముల్లో పలుగోడు గ్రామానికి చెందిన రమణయ్యకు 7.30 ఎకరాలకు ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసింది. ఈ భూములు అటవీశాఖకు చెందినవని గిరిజనులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో గిరిజనులకు, రమణయ్యకు మధ్య కొంతకాలంగా వివాదం నడుస్తోంది. శుక్రవారం రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయగా గిరిజనులు తొలగించారు. ఈ క్రమంలో రెవెన్యూ, అటవీశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో భూములకు సంబందించిన మ్యాప్‌లను పరిశీలించారు. తమ విచారణ నివేదికలను ఉన్నతధికారులకు నివేదిస్తామని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు.

మండలాభివృద్ధికి అధికారులు సహకరించాలి

కేవీబీపురం, అక్టోబరు 5: మండలాభివృద్ధికి అధికారులు సహక రించాలని ఎంపీపీ మునిలక్ష్మి కోరారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ ముని లక్ష్మి ఆధ్వర్యంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిం చారు. అన్నిశాఖల అధికారులు హాజరయ్యారు. ఎక్కువమంది సర్పంచులు, ఎంపీటీసీలు హాజరు కాలేదు. ఎంపీడీవో, తహసీల్దారు బదిలీపై వెళ్లడంతో సమావేశాన్ని ఈవోపీఆర్డీ దయాసాగర్ నిర్వహించారు. అభివృద్ధిపై పెద్దగా చర్చలు జరగలేదు. సమావేశం మమ అనిపించారు. ఈ కార్యక్రమంలో డీటీ మునిరత్నంరెడ్డి, వైస్ ఎంపీపీలు సరస్వతి, శ్రీనివాసులు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన హేమాంబరధరరావు



చంద్రగిరి, అక్టోబరు 5: ముఖ్యమంత్రి చంద్రబాబును టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరపల్లి హేమాంబరధరరావు మర్యాద పూర్వకంగా కలిశారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా పట్టు వస్త్రాలు తీసుకువచ్చిన చంద్రబాబును శనివారం తిరుమలలో హేమాంబరధరరావు కలిశారు.

దారి దోపిడీ కేసులో ముగ్గురి అరెస్టు

సెల్‌ఫోన్, ఆటో, మోటారు సైకిల్ సీజ్



తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 5: తిరుపతి సమీపంలో ఇటీవల జరిగిన దారి దోపిడీ కేసులో ముగ్గురు నిందితులను వెస్ట్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. వారి నుంచి సెల్‌ఫోన్, ఆటో, మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి డీఎస్పీ వెంకటనారాయణ కథనం మేరకు.. తిరుపతికి గ్రాండ్ రిడ్జ్ హోటల్లో పనిచేస్తున్న పంచం దేబ్‌నాథ్ ఈనెల ఒకటో తేదీన తన సొంత ఆటోలో ఇంటికి వెళుతుండగా రేణిగుంట మండలం కరకంబాడికి చెందిన పెనుగొండ వెంకటేష్, చంద్రగిరి మండలం పాత శానంబట్లకు చెందిన 16ఏళ్ల బాలుడు, నెల్లూరు జిల్లా స్టోన్‌హౌస్ పేటకు చెందిన మరో 16ఏళ్ల బాలుడు బైక్‌లో వచ్చి బెదిరించి సెల్‌ఫోన్, ఆటోను తీసుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు వెస్ట్ సీఐ రామకృష్ణ, ఎస్ఐలు బాలకృష్ణ, అనిల్‌కుమార్, ఏఎస్ఐలు సురేంద్ర, షణ్ముగం దర్యాప్తు చేపట్టారు. అలిపిరి-గరుడ సర్కిల్ రోడ్డులో తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన వెంకటేష్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. అతను నేరం అంగీకరించాడు. అతనితో పాటు మరో ఇద్దరు బాలురను అరెస్టు చేశారు. వారి నుంచి సెల్‌ఫోన్, ఆటో, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. వెంకటేష్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. బాలురను జువైనల్ హోంకు అప్పగించారు.

తేనె తెస్తానని తిరిగిరాని లోకాలకు..


పిల్లలతో కలిసి విలపిస్తున్న భార్య భాగ్యమ్మ, (ఇన్‌సెట్లో) వెంకటరమణ (ఫైల్‌ఫొటో)

శ్రీకాళహస్తి, అక్టోబరు 5: తేనెకోసం వెళ్లి మృత్యువాత పడిన ఘటన శ్రీకాళహస్తి మండలంలోని ముళ్లపూడి ఎస్టీకాలనీలో శనివారం చోటుచేసుకుంది. మృతుడి భార్య భాగ్యమ్మ వివరాల మేరకు.. ముళ్లపూడి ఎస్టీకాలనీకి చెందిన వెంకటరమణ(35) చుట్టుపక్కల ప్రాంతాల్లో తేనె సేకరించి, కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రెండు రోజుల క్రితం తేనె సేకరించేందుకు ఇంటి నుంచి వెళ్లిన ఆయన తిరిగి రాకపోవడంతో భార్యాపిల్లలు వెతకడం ప్రారంభించారు. ఈ క్రమంలో శనివారం కాలనీకి సమీపంలోని బావిలో శవమై తేలాడు. బావి పక్కనే చెట్టుపై తేనెపట్టును తీయబోతూ నీటిలో పడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి, పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. నలుగురు ఆడపిల్లలతో రోడ్డునపడ్డ భాగ్యమ్మ గుండెలవిసేలా రోదించడం అందరినీ కంటతడి పెట్టించింది.

వంట మాస్టర్ హత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ జయచంద్ర (ఇన్‌సెట్లో) ప్రవీణ్

ఏర్పేడు, అక్టోబరు 5: వంట మాస్టర్ హత్యకు గురైన ఘటన మండలంలో శనివారం ఉదయం వెలుగు చూసింది. ఏర్పేడు సీఐ జయచంద్ర వివరాల మేరకు.. రేణిగుంట మండలం కొత్తూరు పంచాయతీ మొగలపూడి దళితవాడకు చెందిన ప్రవీణ్(35) వంట మాస్టర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈనెల 4వ తేదీ డ్యూటీకి వెళ్లిన ఆయన తిరిగి రాలేదు. ఆ క్రమంలో ఎరకలింగేశ్వరస్వామి ఆలయ పూజారి ధర్మారెడ్డి శనివారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకోవడానికి మామిడి తోటకు వెళ్లాడు. అక్కడ రక్తపు మడుగులో పడి ఉన్న మృతదేహాన్ని గుర్తించి, 100కు ఫోన్ చేసి సమాచారం అందించాడు. ఏర్పేడు సీఐ జయచంద్ర ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ప్రవీణ్‌గా గుర్తించి పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అతని ఒంటిపై 13 కత్తిపోట్లు ఉన్నట్లు గుర్తించారు. ప్రవీణ్ భార్య వెన్నెల కీర్తి ఫిర్యాదుతో ఏర్పేడు సీఐ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

తిరుపతి నుంచి అంతర్జాతీయ విమానాలే లక్ష్యం



ఢిల్లీకి టిక్కెట్టు కొనుగోలు చేస్తున్న కేంద్రమంత్రి

రేణిగుంట, అక్టోబరు 5: తిరుపతి విమానాశ్రయం నుంచి అంతర్జాతీయ విమానాలు నడపడమే ఎన్డీయే ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. ఇక్కడి నుంచి గల్ఫ్, మస్కట్, కువైట్ దేశాలకు చాలామంది వెళుతుంటారని, వారి విన్నపం మేరకు అంతర్జాతీయ విమానాల రాకపోకలే లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు. శనివారం తిరుపతి విమానాశ్రయంలో ఢిల్లీ, తిరుపతి డైరెక్ట్ ఫ్లైట్‌ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. మొదటి టిక్కెట్‌ను కొనుగోలు చేశారు. విమానాశ్రయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ ప్రపంచ దేశాల నుంచి శ్రీవారిని దర్శించుకునేందుకు భక్తులు తిరుపతి విమనాశ్రయానికి వచ్చి వెళుతుంటారని, ఈ విషయాన్ని గుర్తించి అప్పటి ఎన్డీయే ప్రభుత్వ హయాంలో చంద్రబాబు తిరుపతి విమానాశ్రయాన్ని నిర్మించడమేగాకాకుండా అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దారని తెలిపారు. ముంబై, కోయంబత్తూరు, షిరిడీ, కోల్‌కతా నగరాలకు నేరుగా విమానాల రాకపోకలకు సంబంధించి చర్చలు జరుగుతున్నాయని చెప్పారు. అంతకుముందు విమానాశ్రయ ముందు భాగంలో మొక్కలు నాటారు. ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా చైర్మన్ సురేష్, రీజినల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌జీ ఫణిక్కర్, తిరుపతి ఎయిర్‌పోర్టు డైరెక్టర్ శ్రీనివాసరావు మన్నే, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పార్వతి, గాయత్రి అలంకరణలో అవనాక్షమ్మ



నారాయణవనం, అక్టోబర్ 5: మండలంలోని సముదాయం గ్రామంలో వెలసిన టీటీడీ అనుబంధ ఆలయమైన అవనాక్షమ్మ ఆలయంలో నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం అమ్మవారిని నిత్య పూజా కైంకర్యాలతో మేల్కొలిపి, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం గంటలకు అవనాక్షమ్మ అమ్మవారిని పార్వతి దేవిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తర్వాత తిరుచ్చి వాహనంపై ఊరేగించారు. ● అలాగే కైలాసనాథ కోనలో కామాక్షి అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

మద్యం టెండర్ల ద్వారా భారీ ఆదాయం సమకూర్చాలి

ఎక్సైజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముకేష్‌కుమార్ మీనా



తిరుపతి అర్బన్ ఎక్సైజ్ సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్లను పరిశీలిస్తున్న మీనా

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 5: మద్యం టెండర్ల ద్వారా ప్రభుత్వానికి భారీ ఆదాయం సమకూర్చేందుకు చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముకేష్‌కుమార్ మీనా అధికారులను ఆదేశించారు. శనివారం తిరుమలలో సీఎం పర్యటన అనంతరం మధ్యాహ్నం తిరుగు ప్రయాణంలో ఆయన తిరుపతి అర్బన్ ఎక్సైజ్ శాఖ సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన టెండరు దాఖలు కౌంటర్లను పరిశీలించారు. ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది సంయమనం పాటించి టెండర్లు అధిక సంఖ్యలో దాఖలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని డీసీ విజయశేఖర్‌ను ఆదేశించారు. టెండర్ల విషయంలో కానీ, మద్యం దుకాణాల కేటాయింపుల్లో పారదర్శకంగా ఉండాలన్నారు. అవసరమైన చోట అదనంగా కంప్యూటర్లు ఏర్పాటు చేసుకుని టెండరు దారులకు సహకరించాలని కోరారు. ఆయన వెంట ఏసీలు బాలకృష్ణన్, శ్రీనివాసాచారి, ఏఈఎస్ వాసుదేవ చౌదరి, ఈఎస్ నాగమల్లేశ్వర రెడ్డి, అర్బన్ సీఐ రామచంద్ర, ఎస్ఐలు ఉన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

కేంద్రమంత్రికి ఘనస్వాగతం



కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను సన్మానిస్తున్న కోలా ఆనంద్

శ్రీకాళహస్తి, అక్టోబరు 5: కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కుశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మకు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ ఆధ్వర్యంలో శనివారం ఘనస్వాగతం లభించింది. కేంద్రమంత్రి నెల్లూరు నుంచి తిరుపతికి రోడ్డు మార్గాన వెళుతుండగా కోలా ఆనంద్ ఏపీసీడ్స్ వద్ద ఆయనకు ఘన స్వాగతం పలికారు. గజమాల, ముక్కంటి శేషవస్త్రంతో సత్కరించి ప్రసాదాలను అందజేశారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో భారీ పరిశ్రమలు స్థాపించి అభి వృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేళాగారం సుబ్రహ్మణ్యంరెడ్డి, కోలా గోవర్ధన్, కండ్రిగ ఉమ, ఉమాసింగ్, కొండేటి గోపాల్, అమర్‌నాథ్, ఢిల్లీకుమార్ తదితరుల పాల్గొన్నారు.

వైభవంగా వెంకటేశ్వర పెరుమాళ్ కల్యాణోత్సవం



సత్యవేడు, అక్టోబరు 5: పట్టణంలోని వెంటేశ్వర పెరువమాళ్ ఆలయంలో తమిళ పెరటాసి నెల మూడవ శనివారాన్ని పురస్కరించుకుని స్వామివారికి వైభవంగా కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయంలో వేదపండితులు దేవతామూర్తులకు ఉదయం నిత్యార్చన, తోమాలసేవ నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ మూర్తులకు పాలు, పెరుగు, తేనె, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించి, శాస్త్రోక్తంగా చక్రస్నానం జరిపించారు. స్వామివారిని వివిధ పుష్పాలు, పట్టువస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి వందలాది భక్తులు, మేళతాళాల మధ్య వేదపండితులు కల్యాణోత్సవాన్ని జరిపించారు. రాత్రి స్వామివారిని పురవీధుల్లో ఊరేగించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 5: పల్లమాల కాళంగి ఏరు నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను నీర్పాకోట దగ్గర రెవెన్యూ అధికారులు శనివారం పట్టుకున్నారు. తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు.

అన్నపూర్ణాదేవిగా కామాక్షమ్మ



వరదయ్యపాళెం, అక్టోబరు 5: వరదయ్యపాళెం మండలం అంబూరులో వెలసిన కామాక్షమ్మ అమ్మవారు శనివారం దేవీ నవరాత్రులను పురస్కరించుకుని అన్నపూర్ణా దేవిగా భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు నందకిషోర్‌రెడ్డి పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో విద్యార్థులు



శ్రీకాళహస్తి, అక్టోబరు 5: విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞాన విహారయాత్ర విజన్ -2047 ఎడ్యుకేషన్ టూర్‌కు శ్రీకారం చుట్టిందని డీఈవో శేఖర్ తెలిపారు. ఈ నెల 11వ తేదీ వరకు ఈ ఎడ్యుకేషన్ టూర్ ఉంటుందన్నారు. అందులో భాగంగా శనివారం శ్రీకాళహస్తీశ్వరాలయానికి కడప జిల్లా నుంచి సుమారు 500మంది విద్యార్థులు తరలి వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. వారికి డీఈవో శేఖర్ స్వయంగా అల్పాహారం వడ్డించారు. అనంతరం విద్యార్థులు శ్రీహరికోటకు వెళ్లారు.

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ



ఎంపీడీవో సౌభాగ్యం

ఏర్పేడు, అక్టోబరు 5: ఏర్పేడు ఎంపీడీవోగా డాక్టర్ జి.సౌభాగ్యం శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె కడప జిల్లా నందలూరు నుంచి బదిలీపై వచ్చారు. కాగా ఇక్కడి ఎంపీడీవో గిడ్డయ్య చిన్నగొట్టిగల్లు మండలానికి వెళ్లారు.

చంద్రబాబును కలిసిన టీడీపీ నేత



చంద్రబాబుతో మాట్లాడుతున్న ఆవుల రాంప్రకాష్ యాదవ్

నాగలాపురం, అక్టోబరు 5: తిరుమలకు వచ్చిన సీఎం చంద్రబాబును శనివారం నాగలాపురం మండలానికి చెందిన తిరుపతి పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షులు ఆవుల రాంప్రకాష్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. సత్యవేడు నియోజకవర్గంలోని పలు నామినేటెడ్ పదవులపై చర్చించినట్లు తెలిపారు.



అన్నపూర్ణేశ్వరిగా దక్షిణకాళికదేవి, మధురమీనాక్షిగా నల్లగంగమ్మ, అన్నపూర్ణదేవిగా పానగల్ పొన్నాలమ్మ, గాయత్రీదేవిగా ఆలయంలోని కాళికాదేవి అమ్మవారు, అన్నపూర్ణదేవి అలంకారంలో కనకాచలం కనకదుర్గమ్మ ఉత్సవమూర్తి

అమ్మా..దీవించు

శ్రీకాళహస్తి, అక్టోబరు 5: అమ్మా దీవించు కల్పవల్లి అంటూ భక్తులు ప్రణమిల్లారు. దసరా ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజు శనివారం వివిధరూపాల్లో ఆయా ఆలయాల్లో కొలువైన అమ్మవార్లు భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో జ్ఞానప్రసూనాంబిక ఉత్సవమూర్తి అమ్మవారు తపస్సు అలం కారంలో అలంకరించారు. సాయంత్రం ఆలయంలో రంగుల గోపురం వరకు ఊరేగింపుచేశారు. ఆలయంలోని ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు ఉత్సవమూర్తి అమ్మవారు చంద్రఘంటగా కొలువు దీరారు. ఇదే ఆలయంలో వెలసిన కనక దుర్గమ్మ గాయత్రి దేవిగా దర్శనమించ్చారు. కనకాచలంపై వెలసిన కనకదుర్గమ్మను ప్రత్యేకంగా అలంకరించారు. ముత్యాలమ్మ ప్రత్యేక అలంకారంలో, వేడాం గ్రామంలో వెలసిన దక్షిణ కాళికాదేవి అన్నపూర్ణ దేవిగా, బజారు వీధిలోని కన్యకాపరమేశ్వరి దేవి భాగ్యలక్ష్మిగా అనుగ్రహించారు. పానగల్‌లో వెలసిన గంగమ్మ ప్రత్యేకంగా దర్శనమిచ్చారు. తెట్టు ప్రాంతంలో వెలసిన నల్లగంగమ్మ అమ్మవారు మధుర మీనాక్షి దేవి అలంకారంలో, భాస్కరపేటలోని చాముండేశ్వరి అమ్మవారు అన్నపూర్ణ దేవిగా, బహదూరుపేటలోని కన్యకా పరమేశ్వరి, తెట్టు ప్రాంతంలోని నల్ల గంగమ్మ, విశ్వబ్రాహ్మణ వీధిలోని గంగమ్మ, ముత్యాలమ్మగుడి వీధిలోని నింబజా దేవి, అష్టలక్ష్మి, బీపీఅగ్రహారం గంగమ్మ, పొన్నాలమ్మ, పూసలవీధి గంగమ్మ, శీతాలాంబ, త్రిశూలాంబ, సంతమైదానం అంకాళమ్మ, పీవీ రోడ్డులోని అంకమ్మ అమ్మవార్లు విశేషాలం కారంలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ● బహదూరుపేటలో వెలసిన కన్యకాపరమేశ్వరి అమ్మవారిని శనివారం 1టౌన్‌సీఐ గోపి కుటుంబంతో కలిసి దర్శించుకున్నారు.



ప్రత్యేక అలంకారంలో ముత్యాలమ్మ, అన్నపూర్ణదేవిగా బీపీ అగ్రహారం చిన్నగంగమ్మ, వైష్ణవిదేవి అలంకరణలో బహదూరుపేట కన్యకాపరమేశ్వరి తపస్సు అలంకారంలో జ్ఞానప్రసూనాంబ అమ్మవారు, తిరుమేయచ్చూరు లలితాంబిక అలంకారంలో శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారు

పెనగడంలో వైసీపీ నేత అక్రమ కట్టడాలు



అక్రమంగా చేపట్టిన నిర్మాణం

ఏర్పేడు, అక్టోబరు 5: ఏర్పేడు మండలంలో గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అక్రమార్కులు ఇష్టారాజ్యంగా ప్రభుత్వ స్థలాల్లో అక్రమ కట్టడాలను నిర్మించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా వైసీపీ నాయకులు అక్రమ కట్టడాలు నిర్మిస్తూనే ఉన్నారు. ప్రధానంగా పెనగడం గ్రామంలో ఇందిరమ్మ హయాంలో నిర్మించిన కాలనీకి వేసిన రోడ్డుపై ఓ వైసీపీ నేత అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. పంచాయతీ, రెవెన్యూ అధికారులు వారికి పదిరోజుల క్రితం హెచ్చరికలు జారీ చేశారు. అయినా వారిలో మార్పు రాలేదు. రెండు రోజులుగా నిర్మాణం కొనసాగిస్తున్నారు. మండల అధికారులు స్పందించి రోడ్డు స్థలంలో వైసీపీ నేత అక్రమ కట్టడాన్ని వెంటనే తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై స్థానికులు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన రెవెన్యూ అధికారులు పరిశీలించి అక్రమ నిర్మాణాలను అరికట్టాలని ఆదేశించారు.

వారాహి డిక్లరేషన్‌తో పవన్‌పై గౌరవం పెరిగింది

ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు



రేణిగుంట, అక్టోబరు 5: వారాహి డిక్లరేషన్‌తో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై మరింత గౌరవం పెరిగిందని ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు అభిప్రాయపడ్డారు. తిరుపతి విమానాశ్రయం వద్ద శనివారం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడుతూ తిరుపతిలో పవన్ ప్రసంగంపై తమిళనాడులో కేసు రిజిస్టర్ అయినప్పటికీ ఇబ్బందులేమీ ఉండవని స్పష్టం చేశారు. అన్ని మతాలనూ గౌరవిస్తాను, తన సనాతన ధర్మాన్ని ప్రేమిస్తానని అందరికీ అర్థమయ్యే భాషలో పవన్ చెప్పారని, ఒకవేళ వారికి ఆయన చెప్పింది అర్థం కాక ఫిర్యాదు చేసి ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. తిరుమలలో తన కూతురి చేత డిక్లరేషన్ ఇప్పించడం ఆయన నిబద్ధతకు నిదర్శనమన్నారు.

సత్యవేడు ఎఫ్ఆర్‌వోగా త్రినాథ్‌రెడ్డి

సత్యవేడు, అక్టోబరు 5: సత్యవేడు ఫారెస్ట్ రేంజ్ అధికారిగా (ఎఫ్ఆర్ఓ) త్రినాథ్ రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎఫ్ఆర్‌వోగా పనిచేస్తున్న జయప్రసాద రావును మదనపల్లెకు బదిలీ అయ్యారు. దీంతో నంద్యాల జీబీఎం టైగర్ ప్రాజెక్టులో పనిచేస్తున్న త్రినాథ్‌రెడ్డిని ఇక్కడకు బదిలీ చేశారు.

ముక్కంటి సేవలో తెలంగాణ డీజీపీ



శ్రీకాళహస్తి, అక్టోబరు 5: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని శనివారం తెలంగాణ డీజీపీ డాక్టర్ జితేందర్ కుటుంబ సమే తంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

టీడీపీ నాయకుడి మృతి



రంగనాథ్ (ఫైల్‌ఫొటో)

వరదయ్యపాళెం, అక్టోబరు 5: మండలంలోని సంత వేలూరు పంచాయతీకి చెందిన టీడీపీ సీనియర్ నాయ కులు, మాజీ రైతు అధ్యక్షులు ఎస్.రంగనాథన్ శనివారం ఆకాల మరణం చెందారు. ఆయన మృత దేహానికి టీడీపీ నాయకులు బాబురెడ్డి, సుధాకర్, మునికృష్ణయ్య తదితరులు నివాళులు అర్పించారు.

శనీశ్వరస్వామికి తైలాభిషేకం

శ్రీకాళహస్తి, అక్టోబరు 5: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వరస్వామికి శనివారం ఆగమోక్తంగా పూజలు నిర్వహించారు. గణపతి పూజ, కలశపూజ, అభిషేకం చేశారు. పలు పుష్పాలతో విశేషంగా అలంకరించారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి, అక్టోబరు 5: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన అభయ వెంకటేశ్వరస్వామికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. వివిధరకాల అభిషేకాలు చేశారు. ప్రత్యేకంగా నగలు, పుష్పాలతో అలంకరించారు.

చంద్రబాబుకు సాదర వీడ్కోలు



చంద్రబాబుకు వీడ్కోలు పలుకుతున్న ఎమ్మెల్యేలు అమర్, భానుప్రకాష్, మురళీమోహన్, టీడీపీ నాయకుడు శ్రీధర్‌వర్మ

రేణిగుంట, అక్టోబరు 5: ముఖ్యమంత్రి చంద్రబాబుకు తిరుపతి విమానాశ్రయంలో సాదర వీడ్కోలు లభించింది. శనివారం తిరుమల పర్యటన ముగించుకుని ఉదయం 11.53గంటలకు ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు తిరుగు పయనం అయ్యారు. ఆయనకు కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, కలెక్టర్ వెంకటేశ్వర్, అనంతపురం డీఐజీ షిమోషి బాచ్‌పాయ్, ఎస్పీ సుబ్బరాయుడు, జేసీ శుభం బన్సల్, శ్రీకాళహస్తి, తిరుపతి, పూతలపట్టు, నగరి, పలమనేరు, జీడీ నెల్లూరు ఎమ్మెల్యేలు బొజ్జల సుధీర్‌రెడ్డి, ఆరణి శ్రీనివాసులు, మురళీమోహన్, భానుప్రకాష్, అమర్‌నాథ్‌రెడ్డి, థామస్, మాజీ ఎమ్మెల్యేలు సుగుణమ్మ, వరప్రసాద్, టీడీపీ తిరుపతి పార్లమెంటు అధ్యక్షులు నరసింహయాదవ్, శ్రీధర్ వర్మ, ఆర్‌సీ మునికృష్ణ, ఉదయ్‌కుమార్‌రెడ్డి తదితరులు వీడ్కోలు పలికారు. అంతకు ముందు విమానాశ్రయం వద్ద కార్యకర్తలను, నాయకులను పేరుపేరునా ఆప్యాయంగా పలకరించారు. వినతులు స్వీకరించారు.

మధుర మీనాక్షిగా మరగదాంబిక అమ్మవారు



నాగలాపురం, అక్టోబరు 5: నాగలాపురం మండల పరిధిలోని సురుటుపల్లె పళ్లికొండేశ్వరాలయంలో మరగదాంబికా అమ్మవారు మధుర మీనాక్షి అలంకరణలో భక్తులను కటాక్షించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజైన శనివారం ఉదయం ఆలయంలోని పరివార దేవతా మూర్తులకు అభిషేకాలు చేసి నైవేద్యాలు సమర్పించారు. సాయంత్రం ఆలయ ప్రదోష మండపంలో మరగదాంబికా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని అధిష్టింపజేసి పంచామృతాలతో అభిషేకించారు. అనంతరం అమ్మవారిని వివిధ పుష్పాలతో, బంగారు ఆభరణాలతో, పట్టు వస్త్రాలతో దివ్యాంగ సుందరంగా ముస్తాబు చేసి ఊంజల్ సేవ నిర్వహించారు. అమ్మవారికి నక్షత్ర హారతి, కుంభ హారతి, మహా హారతి చేపట్టారు. ఈ పూజలకు ఆలయ మాజీ ఛైర్మన్ ఏపీఎం బాలాజీ రెడ్డి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈ పూజలను ఆలయ ఈవో లతా ఆధ్వర్యంలో సిబ్బంది పర్యవేక్షించారు.

శ్రీకాళహస్తికి మంచిరోజులు



రామ్మోహన్‌నాయుడుకు జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి దంపతులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 5: మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి తనయుడు సుధీర్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందడంతో శ్రీకాళహస్తి నియోజకవర్గానికి మంచి రోజులు వచ్చాయని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శనివారం కేంద్ర మంత్రి సుధీర్‌రెడ్డి స్వగృహానికి విచ్చేసి ఆతిథ్యం స్వీకరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని బొజ్జల గోపాల కృష్ణారెడ్డి ఆధ్యాత్మిక, పర్యాటక, పారిశ్రామిక, విద్య, వైద్యం ఇలా అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని కొనియాడారు. కూటమి ప్రభుత్వం వంద రోజుల్లోనే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసిందన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని విమానాశ్రయాన్ని మోడల్ స్థాయిలో అభివృద్ధి చేస్తానని భరోసా ఇచ్చారు. త్వరలో దేశంలోని ఇతర ప్రముఖ నగరాలతో పాటు గల్ఫ్ దేశాలకు తిరుపతి నుంచి విమాన సౌకర్యం ప్రారంభించేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తామన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే బొజ్జల దంపతులు కేంద్రమంత్రిని ముక్కంటి శేషవస్త్రంతో సత్కరించారు. కలంకారీ చిత్రపటాన్ని అందజేశారు. టీడీపీ పట్టణాధ్యక్షులు విజయకుమార్, కేంద్రమంత్రిని ఘనంగా సత్కరించారు.

చిరుధాన్యాలను స్వీకరించాలి



సజ్జ పంటను పరిశీలిస్తున్న రమేష్

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 5: చిరుధాన్యాలను ప్రతి ఒక్కరూ విరివిగా ఆహారంగా స్వీకరిస్తే పోషకాహార లోపం ఉండదని ఇక్రిశాట్ ఎంఈఎల్ స్పెషలిస్టు రమేష్ తెలిపారు. మండలంలోని వెలుగు కార్యాలయ పరిధిలో గల రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య ఆధ్వర్యంలో గాజుల పెళ్లూరులో సాగుచేస్తున్న సజ్జ పంటను శనివారం పరిశీలించారు. రైతులకు సజ్జలు, రాగులు, జొన్నలు, కొర్రలు లాంటి పంటలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం మునెయ్య, ఎఫ్‌పీవో డ్రాక్షాయణి, సీసీలు వెంకటరత్నం, వీరజిన్న, ప్రకృతి వ్యవసాయం ప్రతినిధి రామాంజనేయులు పాల్గొన్నారు.

కోయంబత్తూరుకు విమాన సర్వీసులు ప్రారంభించాలి



గల్లా అరుణకుమారి జీవితచరిత్ర పుస్తకాన్ని కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడుకు అందజేస్తున్న గల్లా జయదేవ్

రేణిగుంట, అక్టోబరు 5: తిరుపతి నుంచి కోయంబత్తూరుకు విమాన సర్వీసులు ప్రారంభించాలని మాజీ మంత్రి గల్లా అరుణకుమారి కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడిని కోరారు. శనివారం కేంద్ర మంత్రి అమరరాజా పరిశ్రమలో గల గల్లా అరుణకుమారి స్వగృహానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనేకమంది భక్తులు, వ్యాపారవేత్తలు కోయంబత్తూరుకు వెళుతుంటారని వారికి విమాన సర్వీసు ప్రారంభిస్తే బాగుంటుందని తెలిపారు. అనంతరం గల్లా అరుణకుమారి స్వీయ చరిత్ర పుస్తకాన్ని మాజీ ఎంపీ గల్లా జయదేవ్ మంత్రికి అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, టీడీపీ నాయకులు కోడూరు బాలసుబ్రహ్మణ్యం, సుధాయాదవ్, అమరరాజా పరిశ్రమ చీఫ్ ఆపరేషన్ ఆఫీసర్ నరసింహనాయుడు తదితరులు పాల్గొన్నారు.